# జ్ఞాతి కన్న

సుదర్శనానికి సుబ్బారావు దాయాది అన్న. వాళ్ళద్దరికి వార అయిదేళ్ళు. తమ్ముడిని గెలిచేసి సుబ్బారావు తిన్నదరి గించుకుంటాడు.

దీపం వేయగానే, సుదర్శనం సరస్వతీ ప్రార్థనచేస్తూ పుస్తకాలు ముందుంచుకుంటాడు. సుబ్బారావు క్రికెట్ఆడివచ్చి చల్లగా తమ్ముడిపక్కన జేరి, తనెంత బాగా క్రికెట్ ఆడిందీ చెప్తుతాడు. దోవలో కొనితెచ్చిన వేరుశనగ పప్పుల పొట్లం సుదర్శనం చదివే పుస్తకంమీద, విప్పిపోసి, తినమంటాడు. లేతజీడిపప్పులు జేబులోనించి తీసి, తమ్ముడి చెయ్యిలాగి, అర చేతిలో వుంచుతాడు

'తనరా తిను. బాదం పప్పులల్లే నే తియ్యగా వుంటాయి అంతగా చదివితే బుర్ర వేడెక్కగలదు. చదివిన సంగతులన్నీ కిక్కిరిసి, లోకజ్ఞానం దాచేందుకు చోటుండదు. జుట్టంతా వూడి పోతుంది. లేదా నెరిసిపోతుంది. అలా మొదలెట్టి, ప్రేమాయ ణాలూ, కుటుంబ కలహాలూ, రసవత్తరంగా చెప్తుకుపోయి, చదువుకోనీకుండా చేసి భోజనం వేళైందని లేస్తాడు.

కబుర్ల పోగు, కబుర్లువిని, కావమ్మ పిన్ని గూడా నవ్వింది.

'కబుర్లు చెపితే చెప్పావు గానీ సుబ్బారావ్! అన్నం తిన బోయేముందు చిరుతిండి పెట్టకు. అన్నం వద్దు ఆకలి లేదంటా డు. వాళ్ల నాన్న నామీదికి లేస్తాడు' అంటుంది.

'అబ్బో! పెంపుడు తల్లికే యింత ప్రేమా!' వెటకారం వెల్ల డౌతుంది.

పిన్ని మూతి ముడుచుకుంటుంది. మొగుడు రాగానే కంప్లెంటు చేస్తుంది.

"ఆ సుబ్బారావు పనివేళా వచ్చి, అబ్బాయి చదువు పాడుచేయటమే గాక, యేదో తినిపించి పోతాడు వీడేమో అన్నం మానేస్తే," అంటూ తలతిప్పి, చెయ్యితిప్పి, యీ నాటకం రోజూ చూస్తున్నా. జ్యోతికి కంటోపుంటుందని సామెత, మీరు కలగజేసుకుని మందలించరాదూ? ఇరుగు పొరుగున వుండి యిదా నిర్వాకం? అంటుంది.

"సమయంచూసి మందలిస్తాలే, పద భోజనం పెట్టు" అంటాడాయన.

జనార్దనంగారు ఇంగ్లీష్ లెక్చరర్, భూమీ తోటలూ స్వంతయిల్లూ వున్నా, సంతులేదని అన్న కొడుకును పసిబిడ్డప్పటినించే మాలిమిచేసుకుని, పెంచుకుంటా నిమ్మని తెచ్చుకున్నాడు. వదినగారు శాంతమ్మ సంతోషంగానే ఒప్పుకున్నది. ఆమె తోటికోడలు కావమ్మ. స్వంత చెల్లెలిలాగా అభిమానంగా చూస్తుండటం గమనించింది. చేసుకోలేనివాడు లేవలేనినాడు చేసి పెడుతుంది.

"నీకొడుకే కామూ! వీ మీదికే వురుకుతున్నాడు, నా చేతుల్లో నిలవటంలేదు" అని నవ్వుతూ బిడ్డను కావమ్మ కందించింది తోటికోడలు కావమ్మ ముహం వికసించింది.

అయిదేళ్లు యిట్టే పరుగెత్తినై. అనుకోకండా కావమ్మ చూలాలై, అనాయసంగా కూతుర్ని కన్నది, బారసాల చేసుకున్నారు జనార్ధనంగారు. భోజనాలయాక అన్న మాధవరావు గారు తమ్ముడు సుదర్శనాన్ని కదిలించారు.

"నీకూ సంతు కలుగుతున్నది తమ్ముడూ. సుదర్శనాన్ని తీసికెళతాను, వాడిని కాలు కిందపెట్ట నీయకుండా మరీ నెత్తి నెక్కించుకుని పాడుజేస్తున్నారు" అన్నారు.

తమ్ముడు జనార్ధనం నొచ్చుకున్నాడు.

దత్త స్వీకారం చేసుకోనిదే తనఆస్తి కొడుకు సుదర్శనానికి చెందని, అంతా తనకూతురుకే యిచ్చేసు కుంటాడేమోనని తన అన్న తనను అనుమానిస్తున్నాడని అనుకున్నారు జనార్ధనం గారు అప్పటికేదో సద్దిచెప్పి పిల్లవాడిని యివ్వలేదు.

కూతురు విశాలకి అయిదేళ్లు వచ్చినై. అక్షరాభ్యాసం వేడుక చేసుకుంటానన్నది కావమ్మ. సరేనని మంచి ముహూర్తం పెట్టించి, కూతురుకి అక్షరాభ్యాం, సుదర్శనానికి దత్త స్వీకార మహోత్సవం, ఒడుగూ ఘనంగా చేశారు జనార్ధంగారు.

స్టూడెంట్సూ, తోటి లెక్చరర్సూ, మిత్రులూ, బంధువులూ మూడు రోజులూ, వైభంగా జరిపించి, ఆనందించారు. సుదర్శనానికి డబ్బు, కానుకలూ, భిక్షగా వచ్చినై. దాయాది అన్న సుబ్బారావూ తమ్ముడికి ట్రాన్సిస్టర్ యిచ్చాడు.

"నీకు పెళ్ళి జరుగుతున్నదేమో అనిపించిందిరా తమ్ము డూ. మీనాన్న నీకు అప్సరసలాంటి పిల్లను వెతుకుతున్నాడు, యిలు యిరకాటం, అలిమర్కటం అన్నారు నా మాటగా మామూలు పిల్లని చూసి చేసుకో, రంభైతే యెవరయినా ఔల్లించి మోసగించి యెత్తుకుపోతారు."

"నువ్వేం చేస్తావోచూసి, తరువాతే చేసుకుంటాలే" అన్నా డు తమ్ముడు.

## 2

లెక్కల గ్రూపుతో సుబ్బారావు బియస్సీ చివరి సంవత్స రంలోకి వచ్చాడు. సుదర్శనం అర్థికశాస్త్రం తీసుకుని బి ఏ లో చేరాడు. అది విన్నాడు సుబ్బారావు.

"నువ్వు లెక్చరర్ కావాల్సిందే, ఆశాస్త్రంతో పైకిపోయే అవకాశం లేదు. విదేశం వెళ్ళలేవు. స్కాలర్‌షిప్ తెచ్చుకోలేవు." అనేశాడు ముఖం మీద.

సుదర్శనానికి బాధ కలగలేదు. శాంతంగానే జవాబు యిచ్చాడు.

"నాన్నసలు యిదీ చదవద్దంటే, ఆయన్ని ఒప్పించేప్ప టికి నా తాతలు దిగొచ్చారు." అన్నాడు తలొంచుకుని.

సుబ్బారావు నోరు మూతబడలేదు.

'వివాహో విద్య నాశాయ సర్వం నాశాయ శోభనం' అన్నారు. నేనన్నట్టే నీకు భువన సుందరిని యేరి కోరి తెచ్చి అంట గట్టేశారు. మాంచి అరమొగ్గిన బంగినపల్లి మామిడిపండు రంగులో వున్నదా, వరసైనవారు యీగలు మూగినట్టు మూగు తారు, జాగర్తగా మసులుకో' అని సలహా యిచ్చి బుజం తట్టి నవ్వాడు.

సుదర్శనం ఒక్కసారన్నా మాటకుమాట అంటించాలని చూశాడు.

"నా వదినగారూ కూడా ఊర్వశి లాగేవుంటుంది. అనవ సరంగా నీకు అసూయ పెరిగిపోతున్నది. అది నీకు ఆరోగ్య కరం గాదు" అన్నాడు.

పరాయి వూళ్లో పెళ్ళికివెళ్ళి ఒకపూట వుండి, పెళ్ళికి వెళ్ళి వచ్చానని అనుకున్న సుబ్బారావు, పెళ్ళి హడావుడిలో, మరదలు చంపకాన్ని తిన్నగా చూడలేదు. కావమ్మ పిన్ని కొత్తకోడలి చేత, శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతం చేయించాలని యింటికి తెచ్చుకున్నది. సుబ్బారావు పిన్నిగాని, కోడలుగానీ బైటికి వస్తారేమోనని చూస్తున్నాడు. తనే లోపలికి వెళ్ళి మరదల్ని కవ్విద్దామనుకున్నాడు. అంతలో పొద్దూకి బార్లైటు వెలిగింది.

లక్ష్మీ కటాక్షం కలిగినట్టు, కళ్ళు జిగేల్మనేట్టు మరదలు చంపకం ప్రత్యక్షమైంది.

రవ్వ ముక్కుపుడక, ముత్యాలూ కెంపులూ పొదిగిన జూంకాలూ, ముందుకు వేసుకున్న పొడవైన జడచివర జడగంటలూ, నడుమున గజ్జల వడ్డాణం, వడ్డాణానికి యెర్రిరాళ్ళ లక్ష్మి తళ తళ లాడింది. నీలి పట్టుచీరా అదేరంగు జాకట్టు బిగువుగా వున్నది. కాసులదండ మిల మిలలాడింది. గోరింటాకు పెట్టిన చేతులు యెడమచేతికి వాచీ, రాళ్ళగాజూ, కుడి చేతికి రాళ్ళగాజులూ సాదా బంగారు గాజులూ. మొహాన తిలకం మెడకు నీలిరాళ్ళ నెక్లెసు. పుస్తెలగొలుసు మెరుస్తున్నది. తలలో చామంతి పూలదండా, అన్నిటిని మించిన, వయసు యిచ్చిన లావణ్యం, తారుణ్యం కొట్టవచ్చినట్టు కనబడినై. సత్యభామ యిలా వుండేదా అనుకున్నాడు సుబ్బారావు.

వయ్యారంగా వచ్చి కాఫీ ఫలహారమున్న వెండి పళ్ళెం అతని ముందుంచింది.

'ఓ! మరదలుపిల్ల, నీవల్ల మాయింటికి శోభవచ్చింది.' కన్నార్పకుండా చూశాడు.

ఆ పిల్ల నవ్వి వెళ్ళిపోయింది లోపలికి, పరిమళం వెదజల్లి వెళ్ళింది.

కాఫీ చప్పరిస్తూ సుబ్బారావు తమ్ముడిని గిక్కరించాడు.

'నన్ను చూసి కొత్తలేకుండా నవ్వింది మరదలు, మొగుడిని వదిలేసే రకమేమోరా తమ్ముడూ.'

ఆ మాటలు సుదర్శనానికి మోటుసరసంగా తోచినై. మొహం బిగిసి యెఱ్ఱబడింది.

'అవన్నీ నాన్న విచారించి వుండడా, నీకు వ్యాఖ్యానం అలవాటైంది. మానుకుందూ, నీకూ నాకూ గూడా మంచిది.' అన్నాడు తొణక్కకుండా.

## 3

సుబ్బారావుకి లెక్కలతో యెమ్మెస్సీ చదవాలని వున్నది అప్లై చేశాడు. కాని యెందువల్లనో యేయూనివర్శిటీ వారూ కనికరించి సీటు యివ్వలేదు. చివరికి యెలాగైతేనేం న్యాయ శాస్త్రం చదమని సీటు యిచ్చారు. అదే చదవమన్నారు వాళ్ళమ్మా నాన్నా, స్వతంత్రంగా బతకచ్చు, లేదా జిల్లా జడ్జీ చేయొచ్చు అన్నారు.

సుదర్శనం అర్థికశాస్త్రంతో యెమ్మె చదువుతున్నాడు. కొడుకు పుట్టాడు, అచ్చం తండ్రిపోలికే అన్నారు చుట్టాలు.

సుబ్బారావుకి మతి బోయింది.

'నీ కొడుక్కాదేమో తమ్ముడూ, పెళ్ళై పది నెలలయింది' పడుతూ నవ్వాడు.

"నీకు పుత్రోషం బలిసిపోయింది. యేమంటున్నావో నీకే తెలియదు" అని చల్లగా నవ్వాడు తమ్ముడు.

తన భార్యా రత్నంగూడా కొడుకుని గని గర్వంగా చూస్తుందని ఆసించిన సుబ్బారావు ఆశ నిరాసే అయింది. అతీ గతీ లేదు, బియల్ అయిపోయింది. ఎమ్మెల్ చదవటాని పట్నం ప్రయాణమైనాడు సుబ్బారావు, అతని భార్యా శశి, అత్త మామల పర్మిషన్ ముందే సంపాయించి, తానూ పట్నం వచ్చి కాపరం బెడతానన్నది, వండిపెడతానన్నది, గట్టిపట్టి పట్టింది, యేడ్చింది.

సుబ్బారావుకి భార్యా ఖరాఖరాబైనట్టు తోచింది. అతనికి ఆమె రావటం, తనని అంటి పెట్టుకునుండటం సుతరామూ యిష్టంలేదు. భార్యకి మరోపేరు బ్రేక్ అని అంటాడు. అన్నిటికీ నీతిపేరు చెప్పి అడ్డు పడుతుంది, సిగ్గు బిడియంలేని భార్యె అయితే తను చేసిన పన్లన్నీ అదీ చేస్తుందని అతని వాదన.

అందుకని భార్యని గట్టిగా వాటేసుకుని ముద్దులతో ముంచెత్తి బురిడీ వేశాడు.

"పట్నంలో ఆడవాళ్లు గూడా లా చదువుతున్నారట."

'యేదో తెలియలేదు చెప్పమని వస్తూ వుంటారు. నీకు అనుమానం గలిగి రాద్ధాంతం చేస్తావు. నీకు పొద్దు బోయేందుకు నువ్వో పనిచెయ్యి బి ఏ ఒక పార్టుండిపోయిందా, అది పూర్తి చెయ్యి, యెమ్మె కూడా చదువచ్చు' డబ్బుగూడా పుష్కలంగా చేతులోపెట్టి వెళ్ళాడు పట్నం.

యమ్మెల్ అయిందనిపించాడు సుబ్బారావు. అతని తండ్రి తన స్నేహితుడు గట్టివాడూ అయిన ఒక అడ్వకేట్‌వద్ద అప్రెంటిస్‌గా పెట్టాడు సుబ్బారావును, హుషారూ చురుకుదనం, సూక్ష్మగ్రహీ అయిన అప్రెంటిస్ అందగానే, తన మేధస్సు వ్యర్థమై పోతున్నదే అనే చింతలోవున్న అడ్వకేటు, న్యాయ శాస్త్రం సాధన నూరిపోసి, ప్రాక్టికల్స్ నేర్పుతున్నట్టు తోమి వదిలిపెట్టాడు అప్రెంటిస్‌ని తెలివిగల క్లయింటు వస్తే, పరువు పోకుండా యెలా డబ్బులాగాలీ, దద్దమ్మవంటి క్లయింటువస్తే యెలా యెంత డబ్బు పిండాలీ, రోజులు కలిసివస్తే ప్రతిపక్షుల క్లయింట్సు నుంచిగూడా డబ్బు కక్కించటమెలాగూ, విధవస్త్రీ స్థిరాస్తీ చరాస్తీ అనె గలాటాలో చిక్కుకుని చేతికందితే, కుడీ యెడమా పాటిస్తూ ఆ ఆస్తినీ ధనాన్నీ యెలా గుప్పిట్లో పెట్టుకోవాలీ, డబ్బు కంటపడకపోతే కేసు యెలా నాన్చి నాన్చి యీడ్చాలీ, డబ్బివ్వలేనివాడు గానీ, లోభిగానీ క్లయింటు కుదిరితే, వాడివద్ద నుంచి యేమి లాగాలో యేవిధంగా లాగాలో మొదలైన వన్నీ చాకచక్యంగా తర్ఫీదిచ్చి పుణ్యం సంపాయించాడాయన. సీసాపేరు పేర్కొంటాడు గురువుగారు అప్రెంటిస్ కిమ్మనకుండా, ధర ఖాతరుచేయకుండా తెచ్చియిస్తాడు.

ఇవన్నీ నెరవేరి, ఘనుడనైనా ననుకుని, మంచి ప్రాక్టీస్ అనుకుని తృప్తిపడటానికి యెనిమిదేళ్ళు పట్టింది సుబ్బారావుకి. అప్పుడు మళ్ళా తమ్ముడిమీదికి దృష్టి పోయింది నెలకు నాలు గొందలో మరొక యాభైయ్యో కళ్ళజూస్తూ, యింకా తండ్రి

మీద ఆధారపడి బండి లాగుతున్నాడని వూహించాడు. కాని తమ్ముడిని గురించిన సంగతులు ఒక్కొక్కటీ చెవిన బడుతుంటే సుబ్బారావుకి ఒంటిమీద తెళ్లూ జెర్రులూ పాకినై.

తమ్ముడియిల్లు తమ యింటిపక్కనే. ఫలహారం కానిస్తూ కిటికీలోనించి చూశాడు. పెద్ద వరండా, స్టాండ్ వుయ్యాలవూగుతున్నది. దానిలో గుమ్మడి పండులాంటి పాపవున్నది. బోసి నవ్వులు ఒలకపోస్తున్నది. వుయ్యాల పట్టెలు పట్టుకుని లేవాలని చూస్తున్నది. చిక్కని వుంగరాలజుట్టు, మొహాన చాదు చుక్క, గులాబీ రేకులాంటి బుగ్గలు, కళ్ళకుకాటుకా, మెళ్లోసన్నని గొలుసూ, వేలికి యెర్రరాతి వుంగరం, మరొక చేతివేలికి కక్కులుంగరం, దానిమ్మగింజవంటి పన్ను ఒకటి కనబడుతున్నది. కావమ్మ పిన్ని తెల్లని గౌనుతెచ్చి పాపకు తొడుగుతున్నది.

చంపకం, కొడుకుచెయ్యి పట్టుకువచ్చింది. పిల్లవాడు బూట్లూ సాక్సూ తెచ్చి తల్లికిచ్చాడు. తల్లికూచుని తొడుగుతున్నది, పిల్లవాడు అంటున్నాడు.

"తాతయ్యా! పాటం వినవూ, వాటిజ్ యువర్ నేమ్, మైనేమీజ్ ఆనంద్, ఎక్కం చెప్పనా? అయిదొట్లా అయిదూ. మమ్మా బీ - మీ," రెండుచేతులూ కలివేళ్ళు కదిలిస్తున్నాడు ఆనంద్.

తాత వచ్చి నర్సరీ రైమ్‌విని, చేతివేలు అందించి మన మడిని బడికి వెంటబెట్టుకెళ్ళాడు.

సుబ్బారావు నిట్టూర్చాడు.

మరొకరోజు గడిచింది. రాత్రివేళ, భోజనాలు ముగిసినై సుబ్బారావు మేడమీద పడగదిలో సోఫాలో కూచుని వీక్లీ చదువుతున్నాడు. బార్‌లైటు వెలుగుతున్నది భార్యాశశి మంచం మీదున్నది. 'మహిళ' చదువుతున్నది, ఇంపైన వాయులీన వాయిద్యం వినవచ్చింది, ఓ అరగంటలో మూడు కీర్తనలు వినబడి, వాయిద్యం ఆగిపోయింది.

"ఎవరో ఆవాయించిందీ?" అన్నాడు సుబ్బారావు.

శశి పత్రిక బల్లమీద పడేసింది, పక్కకు వత్తిగిల్లింది, కుడిచేతిమీద ఆదారపడి తలవుంచి, నవ్వుతూ కళ్లు తిప్పుతూ అన్నది.

"చంపకం, మీ మరదలు, ఫిడేలు నేర్చింది, మీతమ్ముడు సుదర్శనం స్టూడెంటు ఒక పేదఅబ్బాయిట. అతను చిన్నప్పటి నించే పిడేలునేర్చాడుట వాళ్ళ మామయ్యవద్ద. ఆ అబ్బాయిని తెచ్చి, తిండిపెడుతూ చంపకానికి పైయొువిన్ నేర్పమన్నాడుట మీ తమ్ముడు" లేచికూచుని చేతులు తిప్పుతూ యింకా చెప్పుకెళ్ళింది శశి.

"మరో మేష్టరు, రేడియో ఆర్టిస్టు, తనమీద యెంత పెద్ద కుటుంబం ఆధారపడి వున్నదో మీతమ్ముడితో చెప్పుకున్నాడట

రేడియోవారిచ్చేది చాలదు, శ్రద్ధగా చెపుతాను ఫ్లూటు నేర్చుకో మని కాళ్ళా గడ్డాలూ పట్టుకున్నాడట, మీ తమ్ముడు యెంత బాగా ఫ్లూటు వాయిస్తారండీ? చెల్లి విశాలకి డాన్సు చెప్పించాడు విశాల తనబళ్లో వార్షికోత్సవానికి వేదికమీద డాన్సుచేసి ప్రైజ్ తెచ్చి అన్నకు చూపించింది. మంచి సంబంధం గూడా చూశాడు చెల్లికి. తాంబూలాలు పుచ్చుకోవటమే తరువాయి, అత్త గారూ మామగారు పిల్లనిచ్చుకుందాము అనేశారు."

తన తమ్ముడి ప్రయోజకత్వానికి, తనభార్య శశి మొహాన వెలిగే ఆనందం చూసి సుబ్బారావుకి రవులుకు పోయింది. తలపంకించి అన్నాడు.

'పెళ్ళిళ్ళపేరయ్యగా తయారౌతున్నాడన్న మాట.'

'లేదు లేదు. సాంతంగా వినగలిగితే వినండి, ఈ పేట కొక యింద్రజాలికు డొచ్చాడు, మీ త మ్ము డి ని పట్టుకుంటే, కాలేజీలో లెక్చర్‌హాల్ అద్దెయివ్వనక్కర్లేకుండా, యింద్రజాలం చూపించుకోటానికి యిప్పించాడు. ఇంద్రజాలికుడు సర్కార్ యెన్ని అద్భుతాలు చూపించాడూ! ఎలక్ట్రికల్ రంపంతో పిల్లను కోశాడు.'

'వీడు గూడా యింద్రజాలం నేర్చి నీకు చూపాడా?'

"ఒకటే తొందరై పాయె, సహనం లేదు. వినలేరు, ఆ యింద్రజాలికుడిదగ్గర సుదర్శనం మెస్మరిజం నేర్చుకున్నాడు" సుబ్బారావు మొహం చిట్లించటం చూసి శశి, మొగుడు వినడేమో వెళ్ళిపోతాడేమో నన్నట్టు గబగబా చెప్పుకెళ్ళింది.

"నేర్చింది చాలా నిష్ఠగా సాధన చేశాడండీ సుదర్శనం, పొరుగింటి సుశీలకి తేలు అంటబొడిచింది. సుశీల పెడబొబ్బలు పెడితే, అందరం పరుగెత్తికెళ్లాము, పాపం! వళ్లంతా చెమటలు గారి, కళ్లు తేలేసి, తడియిపోయింది సుశీల. అప్పుడు సుదర్శనం గూడా వచ్చాడక్కడికి. మెస్మరైజ్ చేసి మినిట్లమీద బాధ తగ్గించాడు. సుశీల లేచికూచుని దణ్ణం పెట్టింది. అంతా ఆశ్చర్యపోయినాం, సుదర్శనం ఆరోజల్లా భోజనం చేయలేదు. సాధనకి చాలా టైమ్‌కావాలట."

సుబ్బారావు నిజంగానే నవ్వేసి, తీసిపారేసినట్లు చెయ్యి ఆడించాడు.

"మెస్మరిటం కన్న అద్భుతాలు చూపటమే గొప్ప. సోమయాజులుగారి దగ్గరికి పోయి లబలబ లాడితే ఆయనింత విభూతి మంత్రించి మింగించి జ్వరం తగ్గించటం లేదూ? దానికాయన ఆయాస పడటం లేదే. విభూతి యిస్తే డబ్బురాలదని యీ కొత్త పద్ధతికి స్త్రీలు విరగబడి వస్తారని నేర్చివుంటాడు."

"మీ హేళనకి అంతెక్కడలెండి సుశీలా, దాని మొగుడు మరిదిని యెంతగా మెచ్చారూ, అతను చెప్పిన పేద విద్యార్థికి యీడాదికీ స్కూలుజీతం కట్టేశారు." శశి చేతులాడించి మెటికలు విరిచింది మొగుడి మొహాన.

"మెస్మరైజ్ చేసి సంతానాన్నిగూడా యివ్వటం నేర్చాడటనా?"

శశికళ్లు పెద్దవైనై. ఓరగా చూసింది మొగుడిని, మళ్లా నవ్వేసి అన్నది.

'బాగా గుర్తుచేశారు, అత్తయ్యా మామయ్యా, మనకు సంతానం కలగలేదని రోజూ నస బెడుతున్నారు. డాక్టరమ్మకి చూపించుకోరాదా అనిగూడా అన్నాడు. ఇప్పుడు పిల్లలకేం తొందర, నేనింకా చిన్నదాన్నే గదా, అనిగూడా చెప్పి చూశాను. శశి అందంగా తలవంచి కళ్లు నిరకొంగుతో అద్దుకుంటున్నట్టు అభినయించింది.

'రేపు తప్పకుండా వెళ్ళి డాక్టర్ని కన్సల్ట్ చేద్దాం' సుబ్బారావు పత్రిక కిందబడేసి, ఆవలించి, లైటార్పటానికి లేచాడు.

# 4

గైనకాలజిస్టూ, స్పెషలిస్టూ డాక్టర్ శారదా, దంపతులిద్దర్నీ టెస్టులు చేయించుకోమన్నది. అవి అయ్యాక వాళ్లిద్దరికీ చిన్నప్పటినించీ వస్తు బాధలు కలిగించిన వ్యాధుల పేర్లు విన్నది. శశిని చూసి "మీలో లోపమేమీ లేదు, జబ్బూ లేదు, ఆరోగ్యంగా వున్నారు" అన్నది.

సుబ్బారావును చూసింది.

"మీకు జీవకణాలు లేవు, మంప్స్ అనే వ్యాధి వచ్చిందని వాపు రెండుసార్లు వచ్చిందని చెప్పారు. చూశారా? అది కొందరిని సంతాన హీనులుగా చేసే అవకాశం వున్నది. అందర్నీ అలా చేయదనుకోండీ. దేవుని దయవల్ల సంతానం కలిగితే కలగవచ్చు అని ఆశించాలి" అన్నది.

శశిలేచి, నర్సింగు హోమ్ ఆవరణలోవున్న పూలమొక్క ల్ని చూడటానికి వెళ్ళి, గోలేల్లో పెంచుతున్నారు. తెలుపు, గులాబీ, యెరుపు, వసుపు, కమలల, నక్షత్రగులాబీలు అందంగా పూసినై. వైట్‌క్వీన్ గుత్తులు వేలాడుతున్నాయి, లిల్లీపూలు బలంగా తెల్లగా వున్నాయి.

సుబ్బారావు ఓసారి భార్య నిలబడివున్న వేపు చూశేడు. మళ్ళా డాక్టర్ని చూశాడు, ఫీజు ఇందిస్తూ అన్నాడు.

'మా పెద్దవాళ్ళు వచ్చి వాకబ్ చేస్తారేమో, మీరు వివరంగా చెప్పక్కర్లేదు. పెద్దతనంవల్ల చాదస్తంగా మాట్లాడుతారు.' ప్రిస్క్రిప్షన్ అందుకుని, జేబులో పెట్టుకుంటూ బయటికి వచ్చేప్పటికి, శశి యెదురుగా వచ్చింది.

నర్సింగుహోమ్ గేటు దాటంగానే సుబ్బారావు శశితో అన్నాడు.

'డాక్టరు చెప్పినదంతా నువ్వు యింటిదగ్గర పెద్దవాళ్ళతో చెప్పొద్దు అనవసరం'

శశికి అతని ఆంతర్యం అర్థంగాక మొదట కలవరపడింది నిదానంగా ఆలోచించి నవ్వింది.

'ఓహో!' అన్నది. చీరకొంగు నీటికడ్డం పెట్టుకుని నవ్వాపుకున్నది. తలొంచుకున్నది.

"మరీ మంచిది" అని మనసులో అనుకున్నది.

'సరే, చెప్పనులెండి' అని మొగుడితో అన్నది.

ఇంటికి వచ్చి, లోపలికి వచ్చేప్పటికి చంపకం వచ్చి భుజంమీద చెయ్యివేసి నవ్వింది.

'రేపు సరోజ పుట్టినరోజు, సాయంత్రం పేరంటం చేద్దాము. రాత్రికి మీరందరు భోజనానికి రావాలి. అత్తయ్యా మామయ్యతో చెప్పి పప్పించాను, తప్పక రావాలి' అని వెళ్ళిపోయింది.

మరునాడు, సుబ్బారావు తనకు, క్లబ్బులో డిన్నరున్నదనీ తాను రాలేననీ తప్పించుకున్నాడు.

పేరంటం నవ్వులతో యెకసక్కెలతో ముగిసింది. రాత్రి విందూ ముగిసింది. తాంబూలాలు లేసుకుంటున్నారు.

"బావగారు తప్పించుకున్నారేం? అక్కా?" అన్నది చంపకం.

సుదర్శనం వదిన తరపున జవాబిచ్చాడు.

"అన్నయ్య మున్సిపల్ కౌన్సిలరయాడు కొత్తగా, ప్రజాసేవలో తీరికలేదు."

శశి తాంబూలచర్వణంవల్ల యెరుపెక్కిన పెదిమలమధ్యగా పలికింది.

"బాగా చెప్పావు మరిదీ, మీ అన్నగారు ప్రజాసేవ చేసి రాత్రిళ్ళు కొంపజేరేప్పటికి పదకొండున్నర అవుతున్నది. నాకు నిద్ర ముంచుతుంది."

'అక్క యెమ్మేకి చదువుతున్నదండీ, నాక్కూడా డిగ్రీ తెచ్చుకోవలని వున్నది. యేం చదువుకున్నారూ అనడిగితే ఇంటరు ఒక సంవత్సరం అనాల్సివస్తున్నది.

చంపకం మాటలకి శశి కలగజేసుకుని అన్నది.

'నీకెందుకు చదువూ? పెళ్ళి అయినందుకు సార్థకంగా ముచ్చటగా ముగ్గురుపిల్లలు కలిగారు. పెద్దవాళ్ళ పోరూ నసా లేవు. నేనే దోమిషపెట్టి తప్పించు కుంటున్నాను.' శ శి త ల తాటించింది.

'నీకిప్పుడేం వయస్సు ముదిరిపోయిందా అక్కా? కొంత మందికి ఆలస్యంగా కలుగుతారు.' చ ం ప క ం శశి చెయ్యి పట్టుకుని అన్నది.

శశి అత్తగారు సూరమ్మ, పిల్లని ముద్దులాడింది. దాని చిలకపలుకులు విన్నది. తప్పడడుగులు వేయిస్తూ, పిల్లను పట్టుకోనూ, వదిలేయలేనూ చేసి వినోదించింది, పొండిది.

"విద్దెం చేస్తే గిద్దెడు నెయ్‌।
కొంచెం చేస్తే చెట్టం నెయ్‌।
మరింత చేస్తే మానెడునెయ్‌।
అంతా చేస్తే అద్దెడు నెయ్‌।"

వెళ్తామంటూ లేచింది సూరమ్మ, కావమ్మ యింట్లోకెళ్ళి వచ్చి తీపీ, జంతికలూవున్న పొట్లాలిచ్చి, మనమరాల్ని అందు

కున్నది. కొత్తగానూ, గాజులు చేతికెక్కించి డబ్బు వుంచిన పిల్ల వచ్చిరాని మాటలతో చూపింది నానమ్మకు.

శశి చంపకాన్ని క్లబు మెంబరుగా చేరమన్నది కావమ్మ లోపలికి వెళ్తుంటే చంపకం కూడా వెళ్ళి చేరమన్నారా అని అడిగింది. అత్తగారు తన అయిష్టతను వెల్లడించింది.

'దానికంటే పిల్లా పాపలేరు, నువ్వు క్లబ్బుల వెంటబడి తిరిగితే పిల్లకుపాలెట్లా, పోతపాలుకా దైవోయె.'

'యెప్పుడు మానమంటే అప్పుడే క్లబ్బు మానుతా, పిల్లకి అన్నం ముట్టిస్తిమిగా, తండ్రికీ మీకే బాగా మాలిమి అయిపాయె.' చేరనీయదేమో అనే ఆదుర్దా నిరుత్సాహం మొహం మీదే కనబడింది చంపకానికి.

కావమ్మ 'చేరు' అన్నట్టు తలూపింది.

సుదర్శనం 'వద్దు' అనలేదు.

## 5

శశితల్లికి హార్ట్ఎటాక్ వచ్చిందని తంతివస్తే శశి బందరు వెళ్ళింది. ఒక నెలవుండి వచ్చింది. వచ్చేప్పుడు శశి ఒక యువకుడిని వెంటబెట్టుకొచ్చింది. అతనిపేరు సుకుమార్. వయస్సు తెచ్చిన అందమే కాక, కసరత్ చేయుటంవల్లా, ఆధునాతనంగా వేషం వేయుటంవల్లా, ఆకర్షవంతంగా వున్నాడు యెమ్మే బియిడీ చదివాడు. ఉద్యోగం దొరకలేదుట, యెమ్మే పరీక్ష వ్రాయటానికి కోచింగు యిస్తాడు జీతనాతాలు లేవు అని తెచ్చానని చెప్పింది శశి, దూరపు బంధువుట.

మీటింగు వున్నదనీ, గొప్ప వ్యక్తులు వచ్చారనీ, డిన్న రున్నదనీ, ఫక్షను యేర్పాటుచేశారనీ, పిక్నిక్కి వెళ్తున్నామనీ చెప్తూ, చంపకం, యిల్లు పట్టకుండా తిరగటం నేర్చింది. తనను పూసుకు తిరిగేవాళ్లను చూసి ఆత్మీయు లనుకుంటుంది. పొడడ్తలకు ఉబ్బిపోతుంది. యిల్లూ, సంసారమనేది జంజాటం తోచింది.

అత్త కామమ్మకి కోడలు ఫేషన్సూ, ఆమె తైనాతీలు ఆ తిప్పటా సుతరామూ నచ్చలేదు. కొంపకేదో అరిష్టము చుట్టు కున్నట్టు తోచి కొడుకుదగ్గర వాపోయింది.

కొడుకు పూరట కలిగించాడు.

"పోనీయమ్మా, వయసుమళ్లాక యేం సరదాలుంటాయీ నా స్టూడెంట్సు నీకు చేతికింద సాయముంటారు. పిల్లల్ని చూస్తారూ. అది యింటిపట్టునే వుంటే నన్ను సాధన చేసుకోనీ యదు. వచ్చి ప్రశ్నలేసి విసిగిస్తుంది, నేను సహనం కోల్పోతాను, నీకు బాధ కలుగుతుందీ, పోనిద్దూ." నిర్విచారంగా అన్నాడు.

తల్లి దవడలునొక్కుకున్నది, ఒళ్లోవున్న బిడ్డతల నిమురుతూ అన్నది.

"నీకు బొత్తిగా ప్రపంచ జ్ఞానంలేకుండా పోతున్నది రా నాయనా. శశి వెంటబడి వచ్చినవాడి వాలకం బాగాలేదు. పక్కచూపులూ దొంగ నవ్వూ వాడూ ఆడవాళ్ళను చేరిచేరకం,

నువ్వేమీ అనవుగదా అని, వళ్ళంతా కనబడేగుడ్డలూ, కత్తిరింపు జుట్టూ అందమని తెల్చింది కోడలు. మొహానికి అన్ని రంగులు పూయాలా? అంతసేపు అద్దంముందు నుంచోవాలా? గుడ్డల కోట్లో అద్దాల బీరువాలో వుంచిన మైనం బొమ్మలాగా తయారుగావటం యిల్లాలి లక్షణమైనా, మీ నాన్న కసలివేమీ పట్టవు."

ఆవిడ వేదన యెక్కువైందేగాని తగ్గలేదు.

"నానమ్మా! అస్తమానం తినకురా అంటే, తమ్ముడు వినటంలేదు. వాడి చేతుల్లోనూ, జేబులోనూ చూడూ జంతికలూ టాఫీలూ యెన్ని వున్నాయో."

పెద్దమనమడు ఆనందం మూడు చక్రాల సైకిలు గడప దాటించి బయటికి తెస్తూ అంటున్నాడు. సరోజ వచ్చీరాని నడకతో సైకిలివేపు వెళ్ళి వెనకసీట్లో యెక్కాలని ప్రయత్నిస్తూ కింద పడింది. యేడవలేదు, సుదర్శనం లేచి కూతుర్ని సీటులో కూచోబెట్టాడు.

తల్లి మళ్ళా అందుకున్నది.

"ఈ విడ్డూరం విన్నావూ? శశి నీళ్ళోసుకున్నది. వాళ్ల వాళ్ళు పసుపు కుంకుమిచ్చాలని వచ్చారు. ఆ ఆర్భాటానికి అంతులేదు. అంతమంది రావాలా? తల్లీదండ్రీ వస్తే చాలదూ?"

"నీకు పెద్దతనంవల్ల చాదస్తం యేర్పడుతున్నదమ్మా. విడ్డూరమేముంది. వదిన వయసులోవున్నది. తల్లివేపువాళ్ళు సరదా మనుషులు కావచ్చు."

తల్లి తల తాటించింది.

'అంతేలే, అంతేలే, నీకసలిటువంటివి మాట్లాడటమిష్టంలేదు కోడలితో, జ్ఞాతుల యింటికి వెళ్ళటం తగ్గించమని, గట్టిగాచెప్పు'

"లేనిపోనివన్నీ వూహించుకుని, మనస్సు కష్టపెట్టుకుంటు న్నావమ్మా, వెళ్ళచ్చో, వెళ్ళరాదో, వెళ్ళటం తగ్గించాలో, అపే యాలో నీకు కోడలికి తెలియదూ. నాకు స్నానం వేళైంది." అని సుదర్శనం లేచాడు.

సైకిలు అటుగా యెదురొచ్చింది. సరోజ దింపేయమ న్నట్టు చేతులెత్తింది. తండ్రి దింపాడు.

ఆ మరునాడు జనార్దనంగారి వెంటబడి చుట్టాలొచ్చారు లోపలికి. వాళ్ళు శశివేపు వాళ్లు, ప్రైవేటుకాలేజ్ అనే వ్యాపా రం ప్రారంభించి దేశసేవ చేయాలిట, జనార్ధనగారి సలహాలు కావాలిట.

మనమరాలు కాళ్ళకు చుట్టేసుకుంటే జనార్ధనగారు యెత్తు కుని ముద్దులాడారు.

దసరాపండగా, శశి సూడిదల వేడుకా, లేడీస్ క్లబ్బులో వినోద కార్యక్రమాలూ, గీతాపఠనమూ, యోగాభ్యాసం నేర్ప మని క్లాసెస్ అరంభింప జేయుటమూ, నర్సరీస్కూలు ప్రారం భించి టీచర్ని యెన్నికచేసి, జీతము నిశ్చయించటమూ, మినీ హెల్తు సెంటరూ, దానికో మిడ్వైఫ్‌ని యేరి తెచ్చి జాబ్ చూపిం

చటమూ, వయోజన విద్య చక్కగా సాగుతున్నదా లేదా అని తనిఖీ చేయటానికి వెళ్లటమూ కుటుంబ నియంత్రణ పద్ధతులు చెప్పేందుకు, ఒక డాక్టరూ ఆమెకొక గదీ, ఆయా, నర్సూ పార్ట్ టైమ్ చేస్తామనగా కుదిర్చి టైమ్ నియమించటమూ వంటి పను లు చంపకం చురుకుగా ఉత్సాహంగా సమర్ధవంతంగా చేసింది మంచిసెక్రెటరీ అని పేరువచ్చిందిగాని తీరికలేకుండా పోయింది. చిన్న ఎగ్జిబిషన్ నడిపింది. క్లబ్‌మెంబర్లు అల్లిన అల్లికలు, ఎంబ్రాడరీ పనులు, చేసిన బొమ్మలూ, పెట్టిన పూరగాయలూ, కుట్టిన గుడ్డలూ పెట్టారు. వాళ్ళ పిల్లలు డాన్సు చేశారు. ఒక మంచి సినిమా చూపారు, టీ స్టాల్, భోజనశాలా నడిపారు క్లబ్‌కి కావాల్సినంత డబ్బు సమకూరింది.

పొగడి పూలదండలు వేసి, తెలివిగల సెక్రటరీ అనేప్ప టికి చంపకం కళ్ళు మెరిసినై. ఆనందంతో పొంగిపోయింది. థాంక్స్ చెప్పింది.

సుబ్బారావు ఎంబాసిడర్ కొన్నాడు, మూడురోజుల్లో అది తోలటం నేర్చాడు. అవకాశం చిక్కినప్పుడల్లా చంకాన్ని ముందు సీట్లో తనపక్కన కూచోబెట్టుకుని యింటికి తెచ్చేవాడు. ఆమె అవసరాలకి తనకి వీలున్నప్పుడల్లా కారుతోసహా అంటే వాడు, ఉబ్బేసేవాడు.

"చంపక్! నీకు మీవాళ్లు బాగా ఆలోచించి పేరు పెట్టారు. మేకప్ అవసరం లేకుండానే సినీస్టార్‌లాగా వుంటావు." అంటూ నడుంచుట్టూ చెయ్యివేసేవాడు, కుడిచెయ్యి చక్రం మీదుండేది.

చంపకం మనస్సు పరవళ్ళు తొక్కేది. మొగుడొక్క నాడూ పొగడడు సరికదా, యెప్పుడూ ఆపాడు సాధన, పలకరించి నవ్వితే చికాకుపడతాడు. ఒక్కనాడుగూడా తన సౌందర్యాన్ని పొగడలేదు, చూడనుగూడా నిన్నగా చూడలేదేమో.

అత్త సరేసరి, తుమ్మల్లో పొద్దూకినట్టు మొహంపెడుతుంది వ్చ్! భర్త మెచ్చని అందం, అత్త మెచ్చని గుణం అయింది తన సంగతి. కలక్టరుగారి భార్య దగ్గర్నించి, క్లబ్ మెంబర్సంతా నవ్వుతూ పలకరిస్తా రెప్పుడూ.

మరొక శరణాలయం వాళ్ళువచ్చి బెనిఫిట్ పెర్ఫామెన్సు యేర్పాటు చేసిపెట్టమనీ, పేదపిల్లలకి బడి నడుపుతున్నామని చెప్పారు. ఒకామె 'పప్పెట్‌షో' చూపిస్తానన్నది, అది యేర్పాటుచేసి టికెట్లు అమ్మింది చంపకం, బొమ్మలాట చూడటానికి చాలామంది వచ్చారు. చాలా బావుంది అన్నారు

డబ్బు లెక్కచూసి శరణాలయం వాళ్లకి యివ్వాల్సింది యిచ్చి మిగిలిన కొంచెం సేఫ్‌లో పెట్టి, క్లబ్ ప్రెసిడెంటూ చంపకం, ట్రెజరరూ, మరోయిద్దరు సభ్యులూ క్లబ్బుబయటికి వచ్చేప్పటికి, బావగారు సుబ్బారావు కారుతో సహా యెదురుగా కనిపించాడు. అంతా అలిసి వున్నారు, మచ్‌మన్ క్లబ్బు తాళం వేస్తున్నాడు.

"రండి నేను డ్రాప్‌చేస్తా, చాలా లేటైందే" అని నవ్వి తలుపుతీసి కూచోమని చూపించాడు.

ఒకళ్ళ నొకళ్ళు చూసుకుని, నవ్వుకుంటూ నెట్టుకుంటూ వచ్చి కార్లోదూరారు. అందర్నీ వాళ్ల యిళ్లవద్ద దించి చంపకం సుబ్బారావు యింటికి చేరేప్పటికి పన్నెండయింది.

సుబ్బారావు తన యింటిముందు పోర్టికోలో కారు ఆపాడు. దిగి అటు తిరిగివచ్చి కారుతలుపు తీసిపట్టుక దిగి రమ్మని నవ్వుతున్నాడు.

పేరూ, డబ్బూ, పరపతీ సంపాయిస్తూ, హోదా వేషం వేస్తున్న బావగారలా నవ్వుతూ, వినయం, సభ్యతా చూపిస్తే చంపకానికి గర్వం కలిగింది.

"బాగా అలిసి వున్నావు చంపక్, అంతా మంచి నిద్రలో వున్నట్టున్నారు, మా యింట్లో లైటు వెలగటంలేదు, లోపలికిరా సయించినంతే యేదో తిని వెళ్దువుగాని" అన్నాడు.

చంపకం ఆవలించి, చిటిక వేసింది. కారులోంచి దిగలేదు కోరికను అణిచిపెట్టి అన్నది.

'మీ తమ్ముడూ పిన్నీ, యీమధ్య నాతో మాటలు తగ్గించేశారెందుచేతనో, యేదన్నా అడిగితే, నిందో నిష్ఠూరమో వింటున్నాను. ఇంటికిపోతే మంచిదేమో.'

సుబ్బారావు చిత్రంగా నవ్వి అన్నాడు. కారు మీదికి వంగితే మొహం దగ్గరైంది.

'పిన్ని పెద్దదిగాదూ, చాదస్తం యేర్పడింది. నా తమ్ముడా! సాక్షాత్తూ గౌతముడుగాదూ, కుచ్ఛితం యెరగడు. అనుమానమనేదిలేదు వాడికి రావాలి.'

అంటూ చేతులుజాపి చంపకాన్ని యివతలకి తెస్తే, చంపకం ఒళ్ళు పులక లెత్తింది.

బెల్ మోగింది. పనిపిల్ల తలుపుతీసింది, తెల్లని బొచ్చు కుక్క తోకాడిస్తూ వచ్చి, వాళ్ళిద్దర్నీ రాచుకుంటూ తిరిగింది.

"నువ్వు పైకిపో అమ్మగారు నిద్రబోయినట్టున్నారు" అని పిల్లను తోలేశాడు, అది కళ్ళు నలుపుకుంటూ వెళ్ళింది కాదు తాళంచెవి మేకుకు తగిలించాడు, వీధితలుపులు గడియబడినై. బుజం చుట్టూ చెయ్యేసి నడిపించుకెళ్లాడు.

'నా అత్తవారు, స్త్రీల కళాశాల పెడుతున్నాము, మీకు తోచిన విరాళ మిమ్మని అడిగితే, నా తమ్ముడు సంకోచంలేకుండా లక్షా ట్రాస్ట్‌చెక్ సంతకం చేసి అందించాడు, వాళ్లు దిమ్మర పోయారు తెలుసా చంపక్! బాబాయ్ కోశాధికారి, కట్టడము, లైబ్రరీ, సైన్సు లేబరేటరీ అన్నీ చక్కగా సమకూర్చి పెడతాడుట.'

తువాలా అందించాడు, చేతులూ ముఖంకడుక్కొని అద్దుకున్నది. బల్లమీద అన్నీ అమర్చి మూతలుపెట్టి వున్నాయి. సర్వ చేశాడు, పక్కనేకూచుని తినిపిస్తూ మీరువడ్డిస్తు వింత కబుర్లు చెప్పాడు, చంపకానికి పైన ఫాన్‌తిరుగుతున్నట్టే తలగిర్రున

జరిగి ది. తాను మున్సిపల్ చైర్మన్ కాబోతున్నాడుట, తనతో అవసరమున్న వాళ్ళు తమ భార్యలను పంపటానికి వెనుకాడ రుట, ఇక వంటరి ఆడవాళ్లు సరేసరి తన మంచితనానికీ, అం దానికీ, పరపతికీ సమ్మోహితులౌతారుట. పిలుపు అందటమే తరువాయిట.

చంపకానికి నిద్ర తూగుతున్నది. నవ్వువచ్చి నవ్వింది చెయ్యా మూతి తుడుచుకుంటూ లేచింది. కనురెప్పలు బరువెక్కి నై, భోజనం వేడిగా రుచిగా వుండటంవల్ల యెక్కువగా తిన్నా ననుకున్నది.

'ఇంటికి పోతా' అన్నది.

"ఆగదిలో మా అమ్మ నిద్రబోతున్నది, రెండో మంచం మీద పక్క పరిచివున్నది, దానిమీద పడుకో పో" గది వాకిట్లో వదిలిపెట్టాడు.

"గుడ్డలు మార్చుకోవాలి యింటికిపోతా, మా మయ్య తలుపు తీస్తారు." అన్నది జోగిపోతూ.

"బాబాయి వూళ్ళోలేడు," స్టాండు మీదున్నాయి స్త్రీ చీరా రవికా అందించాడు, ఇదుగో అమ్మ చీర, గుడ్డలు మార్చుకో, తలుపు వేసుకోనే పోతున్నా, అన్నాడు.

చంపకానికి మరొకరి చీర కట్టడం యిష్టమూ లేదు అల వాటూ లేదు. అట్లాగే మంచంమీద వాలింది.

కలలాగా తోచింది, మొగొడొచ్చి లేవదీసి పడగ్గదిలోకి నడిపించుకెళ్తున్నట్టూ బట్టలు మార్చినట్టూ, పాలో, మంచినీళ్లో తాగించినట్టు, తలుపు గడియపెట్టుకున్నానే యెట్లా వచ్చాడు వచ్చాడు లోపలికీ అనుకున్నది, అదీ నీలిబల్బ్ అక్కడ పాప వుయ్యాలోవున్నది.

తట్టి లేపినట్టు మెలకువ వచ్చింది చంపకానికి తలడిమ్మూ ఒళ్ళు బరువూ, బద్ధకంగా వున్నది. యెక్కడున్నదీ గుర్తురాక పోగా, యేదో చెలియని భీతి కలిగింది, అదుర్దా కలిగింది, అది తమ యిల్లు కాదనీ, అది తన పడగ్గది కాదనీ గుర్తువచ్చేసింది.

తెల్లవారవస్తున్నది, కాకుల అరుపులూ, చీకటి విచ్చి పోతూ, వెలుగురేకలు వ్యాపిస్తువున్నాయి, కిటికిలోనించిచూస్తే తెల్లని ఆకాశం, తమయిల్లు మసగ్గా కనబడిపై, చంపకం తన చీర నలిగివుంటే దిద్దుకున్నది. గదితలుపు తీసి వున్నది. వీధి వేపువెళ్తే, వీధి గుమ్మం బార్లాతీసి వున్నది, తమ యింటికి వెళ్ళింది, పనిమనిషి నీళ్లుతేవటానికి బకెట్టుతో దొడ్డివేపు వెళ్లటం కంటబడింది. వీధి చిమ్మివున్నది.

అత్తగారు బాయిలర్ ముట్టిస్తున్నది, మొగుడు స్నానాల గదిలో వున్నాడు. తన గదిలోకి వెళ్ళింది, పిల్లలింకా నిద్రలేవ లేదు, తన మంచంమీద వాలి కళ్లు మూసుకున్నది, గోడ గడి యారం అరగంట కొట్టింది, చూస్తే అయిదున్నది అయింది. కళ్ళు మూతలు పడిపై, మంచులిచ్చి పోయినట్టు రాత్రి అను భూతి, అనుభవం, ముద్దుమాటలు, వళ్ళు పులకలు, మబ్బుల్లో

విహరించి వచ్చినట్టు తోచింది. ఇంద్రధనుస్సు తాకి చూసి నట్టు తోచింది, కోకిల అరుపులు, మైనా మాటలు, సెలయేటి ధ్వని వినిపించినై, గర్వంగూడా కలిగింది.

## 6

చంపకం మధన పడలేదు, వరసైన వాడేగదా, బాగా ఆకర్షించాననుకుని నవ్వుకున్నది.

రోజులు మామూలుగా దొర్లిపోయినై, మరో రెండు నెల లకి మరో సంఘటన జరిగింది.

పక్కవూరు వెయ్యి గడపగల గ్రామం. అనాథ స్త్రీలకీ, దారి తప్పిన స్త్రీలకీ 'కేర్ ఆఫ్టర్ హోమ్' అనే సంస్థ స్థాపిస్తూ, ప్రారంభోత్సవానికి రమ్మని గ్రామపెద్దలు క్లబ్బులకి ఆహ్వానా లు పంపారు. క్లబ్బు మెంబర్స్‌ని వెంటబెట్టుకురమ్మని, చంప కానికి వ్యాన్ పంపారు. బంధువులనీ, స్నేహితులనీ గూడా వెంట బెట్టుకెళ్ళింది చంపకం, ఇష్టమున్న వాళ్ళందరి చేతా అయిదూ, పదీ, వంద విరాళమిప్పించింది మంచి విందు ఆరగించి చాలా మంది యింటిముఖం పట్టారు.

వినోద కార్యక్రమం చూతామని కొంతమంది వుండి పోయారు. నాట్యం, యేకాంక నాటిక, వీణాగానం, గాత్రం గబగబా అయిపోయినై. విసుగనిపించ లేదు.

మళ్లా కొంతమంది వెళ్ళిపోయారు.

సుబ్బారావూ, తల్లీ, పిల్లలూ, కొద్దిమంది స్నేహితులూ మిగిలారు. టైమ్ పన్నెండయింది. చాలా పొద్దుబోయింది, తెల్లారి వెళ్ళమని ఒక విడిది యిచ్చారు, గ్రామపెద్దలు, విడిది విశాలంగా వున్నది. గాలీ, పూలవాసనలు, మంచి పక్కలు వేసిన మంచాలూ.

ఆరాత్రిగూడా మంచి నిద్రబట్టింది చంపకానికి, మళ్ళా అదే అనుభవం. అదే నీలి దీపం, కళ్లువిడిబడవు, లేవాలని వున్నది. దుస్తులు మార్చుకోవాలి.

తెల్లవారుజామున నాలుగున్నారకి, మత్తు వదిలింది. మెలకువ వచ్చిందిగాని, లేవబుద్ధిగాలేదు, అనుభవమూ తెలిసిపోయింది.

పక్కకి చూసింది, సూరత్తమ్మగారు గుఱక పెడుతున్నది నిండా ముసుగుతన్నింది. మరొక మంచంమీద పిల్లలు ఆదమరిచి, చల్లగాలికి, నిద్రబోతున్నారు.

కొడుకుచేసే పనులకు తల్లి షరీకైందా అని అనుమానం కలిగింది. మెల్లిగా లేచినించుని దుస్తులు తిన్నగాదిద్దుకున్నది చంపకం. అత్తగార్ని పిలుస్తూ కుదిపింది. ఆమె లేవలేదు. ఆమెకు తీవ్రంగా ఫిట్సువస్తాయనీ, డాక్టరు నల్లమందు మాత్ర వాడకపోతే మరీయెక్కువగా వచ్చి, తన్నుకుంటూ పడిపోతాననీ

అత్తగారు చెప్పినమాటలు గుర్తువచ్చినై. ఒకవేపున ఆనంద మూ, గర్వమూ కలుగుతున్నా, వ్యవహారం శృతిమించినట్టుతోచి, దిగులూ, యేమి చేయాలా అనే విచారమూ కలిగాయి.

తన భర్త, సాధనఅనీ, యేకాగ్రత అనీ, ఆత్మ నిగ్రహం అనీ యిందుకే తన్నుకుంటూ, తనను తాను వశంలో వుంచుకో వాలని తాపత్రయ పడతాడేమోనని అనిపించింది. అతడూ అందగాడే, బక్కపలచగా, తెల్లగా వుండి, పెద్దకళ్లూ, పల్చని మెత్తని చేతులూ తీర్చైన ముక్కూ మూతీ అతనికి పరస్త్రీలకి వశంకావటం అసహ్యమేమో! తన జ్ఞాతి అన్న సంగతి తెలిస్తే చెపితే యేమి చేస్తాడూ! గౌతముడల్లే శపిస్తాడా?

ఇంటికి చేరినా దిగులుగానే వున్నది చంపకం.

ఇళ్లువేరైనా రెండు కుటుంబాలూ ఒక కుటుంబంలాగే మసులుకుంటాయి. శశి కూతుర్ని కన్నది, పిల్లకి హేర్‌లిప్. పాలు తాగలేదు, సర్జరీ చేయించాలని డాక్టరన్నాడు. ఆ బిడ్డ తోనే అవస్థ పడుతున్న శశికి ధనుర్వాతమొచ్చింది. అది నయమై లేచి తిరుగుతున్నది. అత్తగారికి ఒక కాలూ చెయ్యీ పడిపోయి మంచంలోనే వున్నది. మామగారు బదరీనాద్, పూరీ ప్రయాగా వెళ్లారు. యాత్రలనించి యింకా రాలేదు. శశి కన్నవారు వచ్చి యిల్లు మానేజ్ చేస్తున్నారు. సుకుమార్ యింటికి చెందిన మనిషిలాగే మసులుతున్నాడు. అన్నిపనులు

అందుకుంటూ, స్నేహంగా వుంటున్నాడు, చంపకం యింటికి ఒకటి రెండుసార్లు వెళ్లాడు. పిల్లల్ని ముద్దుజేస్తాడు. పెద్దలకి నమస్కారం చేస్తాడు.

చంపకం యింటినిండాగూడా చుట్టాలే, విశాలా భర్తా వచ్చారు. అల్లునివాళ్ళు కోర్టువనుల మీదా, సంబంధాలు విచారించటానికి వస్తూవుంటారు.

శశి చంపకాన్నే నమ్ముకున్నది. ఇంకా బాగా కోలుకోలేదు. పిల్లకు పాలుపోయాలి, చంపకం యింట్లో కనబడకపోతే యెవరూ పట్టించుకోలేదు, శశి అన్నం దినగానే నిద్రబోరాదు. చంపకం పిల్ల వుయ్యాలవూపుతూ, అక్కకి కబుర్లు చెపుతూ వుండిపోయింది.

రాత్రి భోజనం చేయమన్నారు, శశీ పాపా వున్నగదిలో మంచంమీద కూచుని కబుర్లాడుతూ జోగిపోయింది. ఒళ్ళు తెలియని నిద్రబోయింది.

చలిగాలికి మెలకువ వచ్చేప్పటికి గడియారం, టిక్కూ టిక్కూ మనటం వినిపించింది. మరికాసేపటికి రెండు గంటలు కొట్టింది. మేడమీదికి పాకి, తాడుతో అల్లిన వలమీదికి చిక్కగా వ్యాపించిన పెద్దజాజి విరియబూసింది. కాని అక్కడా అక్కడా ఖాళీగావున్న ఆకుల సందునించి వెన్నెలచుక్కల దువ్వటిలాగా

చంపకంమీద పడుతున్నది. పున్నాగ చెట్టు మేడపక్కగా పైకి పెరిగింది, పెద్దచెట్టు, పున్నాగపూల వాసన ఘాటుగా తగులుతున్నది.

లేచికూచున్నది చంపకం, ఇక్కడెందుకున్నానూ? ఎప్పుడొచ్చానూ? యెవరైనా లేవదీసి తెచ్చారా? పాప వుయ్యాల వూపుతూ మంచంమీదున్నా గాదూ? క్రిందకివేలాడుతూ జీరాడుతున్న గుడ్డలు అందుకున్నది. సింగారించట మయాక, తల ముడేసుకున్నది. నాలుగువేపులా చూసింది. దాపునే యీజీ చైర్లో సుకుమార్ అర్ధనిమీలిత నేత్రాలతో వుండటం కనిపించి అప్రయత్నంగా నోటిమీద చెయ్యి వేసుకున్నది. ఒళ్లు జలదరించి, రోమాలు నిక్కబొడుచుకునై. మరుక్షణంలో అవి తగ్గి చీదరా, అసహ్యమూ కలిగినై.

సుకుమార్ లేటెస్టు డిజైనున్న లుంగీకట్టాడు. సన్నని బంగారుగొలుసు మెళ్లో మెరుస్తున్నది. కాలుతున్న సిగరెట్టు చివరికి వచ్చేసింది. క్రాపుబాగా చెరిగి వున్నది. వంటికి చిరుచమట పట్టివున్నది.

చంపకం లేచినించోటం చూసి లేచివస్తూ, సిగరెటు ముక్క కిందబడేసి చెప్పుకాలితో నలిపాడు, దగ్గరగా వచ్చాడు.

'నేనిక్కడెందుకున్నానూ? నువ్విక్కడెంత సేపటినించీ వున్నావూ' మొహం చిట్లించి అడిగింది.

"నీకు నిద్రలోలేచినడిచే జబ్బువున్నది చంపా, ఆసంగతి నీకు తెలిదేమో! నేనున్న చోటుకు వచ్చి తట్టిలేపితే నేనుకావాలే మోననుకున్నాను. కింద అయితే పట్టుబడతామేమోనని, పైకి తెచ్చాను, స్వర్గసౌఖ్యం చవిచూస్తున్నట్టు, తనివితీరా నా ఒళ్ళు తడుముతూ ..." తూలుతూ, మత్తుగా నవ్వుతూ చూ మీ ది క వంగాడు సుకుమార్.

చంప చుఱుమనిపించింది చంపకం. పొంగిందేమో బుగ్గ చంపమీద చెయ్యి వేసుకున్నాడు, తోపుతోసింది, పోయి వాలు కుర్చీ పేముది పెద్దది, దాంట్లోపడ్డాడు, నొచ్చుకోలేదు. కోపం లేదు, అసహ్యం లేదు మొహంమీద, ఇలాటివి మామూలే, అల వాటేనాకు అన్నట్టు, కళ్ళు చికిలించి నవ్వి, చెదరిన గొ లు సు సరిగా దిద్దుకుంటూ అన్నాడు.

'ఇంటిగుట్టు లంకకిచేటు మైడియర్, పితూరీ లేవదీసేవు. పరువూ ప్రతిష్ఠా పారిపోతై సుబ్బారావుకన్నా, సుదర్శన్‌కన్నా చిన్నవాడినే నా చెంపలబిగువూ నునుపూ చూడు, నేనబద్ధమాడ టం లేదని తెలుస్తుంది. పెద్ద చదువే వెలగబెట్టా, యెంత ప్రయ త్నించినా నాకూ నావాళ్ళకూ, కూడూ గూడూకి స రి పో యే జీతంరాల్చే వుద్యోగం లభించలేదు. పరవలేదు, తైరు పోయ టం, కాళ్ళుపట్టుకోటం చాతకాలేదు, నా మేధస్సూ, నా మార్కు లూ చూస్తారనుకున్నాను. అంతామిథ్య.

నా హితంకోరిన మిత్రుడొకడు, తన సుఖజీవన మార్గం వర్ణించి చెపతూ యిదొక వింతజాబ్ అన్నాడు. బాధాకరంగా వున్నది చెప్పటం అన్నట్టు విషాదంగా నవ్వాడు సుకుమార్.

'ట్రై' చేసి చూడమన్నాడు. మెళుకువుగావుంటూ, తెలివి గా మసులుకోవాలి అని హితోపదేశం చేశాడు. అయితేనిది, హాబీగా ట్రీట్ చేస్తూ వస్తున్నాగాని, పర్మనెంటు జాబ్‌గా తలచ టంలేదు. నన్ను కోసిచూసినా, నాకు దురుద్దేంలేదు, నారక్తం లో అటువంటి గుణం కనపడదు సుమా నాకు నచ్చిన జాబ్ యివాళ చూపించినా, యిప్పించినా జండా పీకేస్తాను, బిచాణా మడిచేస్తాను, ష్యూర్ థింగ్. తర్వాత నువ్వెవరో నేనెవరో గప్ చప్. వెకిలిగా, నాకామనిషి తెలుసు, యీ ఆడది నేరమంటే వస్తుందీ అని చెప్పుకోను.

శశివాళ్ళ వూరు వచ్చినప్పుడు, వాళ్ళ తమ్ముడికి ట్యూట ర్‌గా వుండగా చూసింది, రమ్మని గట్టిగా అడిగితేనే వచ్చాను. శశి నీకేమీ చెప్పలేదా? మంచి పిల్లనుచూసి నాకు పెళ్ళికూడా చేస్తానన్నది. ఆమె తనమాట నిలబెట్టుకుంటె, నేనూ యేకపత్నీ వ్రతం పట్టుతాను. సజ్జనుడనౌతాను, పరస్త్రీని కన్నెత్తిచూడాను సారంగనీతులు వల్లెవేస్తాను. విప్రనారాయణాడ నౌతాను. నా కసలిటువంటి పనులు యేహ్యం, సుతరామూ యిష్టం లేదు. ఒక్కొక్కప్పుడు విధివక్రిస్తుంది, మనమంతా విధిచేతికీలుబొమ్మ లం, "తీయనిగొంతు, విలాసమైన నవ్వు, చేతులు తిప్పుతూ తల ఆడిస్తూ చెప్పినతీరు చూసి చంప్రకానికి నవ్వువచ్చింది.

"దొంగవేదాంతం చెపుతున్నాడు" అనుకున్నాడు. కృత్రి మ కోపం చూపుతూ, "సినిమాలో చేరకపోయవా డైలాగ్స్ బాగా పలకగలవు" అన్నది.

"అది ట్రైవేశాను ప్రియా, ఆఫీల్డు చాలా డేంజర్. అక్కడా మర్దతు, మనల్ని కాపాడేవాళ్లూ వుండాలి. ఇదే నిరపా యకరంగా కనబడింది. ముసుగులో గుద్దులాట బల్‌ఫస్టుగా యెంజాయ్ చేయొచ్చు."

# 7

భట్రాజులల్లే, వందిమాగధులల్లే చుట్టాలు సుదర్శనాన్ని దానకర్ణుడనీ, కళాపిపాసి అనీ పొగిడారు. బీదా, సాదా మను షులు "ప్రాణదాత" అని బిరుదు యిచ్చారు. సుబ్బారావు యింట్లో, అడపా దడపా, డాన్సు ప్రోగ్రాములూ, సంగీత కచే రీలూ జరగ సాగినై. అవి చంపకానికి, వూరట కలిగించినై. వాటిని కండక్ట్ చేస్తూ మానేజ్‌చేస్తూ, పక్కింటి దాయాది బావ గారింటికి వెళ్ళటం, అతిచనవూ తగ్గించేసుకున్నది. క్లబ్బులో మరొక సెక్రెటరీని యెన్నుకున్నారు, క్లబ్బుకీ అంతగా వెళ్లటంలేదు.

శశి కొడుకును కన్నది, సుకుమార్‌కి నచ్చిన వుద్యోగం లభించనేలేదు. శశికొడుక్కి కాళ్ళు నిన్నగా లేవు. సుకుమార్ స్పెషలిస్టును పట్టుకొచ్చాడు. చంపకానికి చూసి రావాలనిపించ లేదు. అత్తగారు మర్యాదకోసం వెళ్ళిచూసి రమ్మన్నా, యేదో సాకు చెప్పి వెళ్ళలేదు, సుబ్బారావు వస్తుపోతూవే వున్నాడు. కవ్విస్తు వుంటాడు.

పొద్దూకింది, వంట వేళైంది, అత్తగారు బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నది, చంపకం వంటింటి వరండాలో కూచుని కూర తరుగుతున్నది.

సుబ్బారావు వచ్చి చనువుగా వీపు తట్టి, పక్కకూచుని అన్నాడు.

'పక్కా గృహిణివై నావే చంపక్! అయ్యో! వెగటా యేనౌరా మరేమాయే. బాయికాట్ చేశావా?' అని వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనాలవేళయింది, చంపకం అన్నానికి వెళ్ళలేదు, పిల్లలూ అన్నాలుతిని నిద్రబోయారు.

అత్తగారు, కోడల్ని పిలుద్దామని వెళ్ళింది, చంపకానికి, దిగులూ యెక్కువైనై, యేవో గుర్తువచ్చి, బోర్లపడుకుని యేడుస్తున్నది.

అత్తగారు వేవిళ్లేమో ననుకున్నది, వీపుమీద రాచింది, 'అని మృదువుగా అడిగింది.

ఆకాస్త అదరానికే చంపకం యేడుపు కట్టలు తెగింది. చేతుల్లో మొహందాచుకుని వెక్కివెక్కి యేడ్చింది, జరిగిందంతా అత్తగారికి చెప్పాలనిపించింది, కాని సిగ్గూ బిడియమూ అడ్డుపడినై.

'నాకు నిద్రలో లేచి తిరిగే అలవాటూ, యెవరినైనా లేపే అలవాటూ వున్నదా అత్తయ్యా?' అత్తగారి భుజంమీద తల వుంచి, భోరుమని యేడ్చింది.

అవిడ కాదుర్దా గలిగింది, దిష్టి తాకిందను కున్నది.

'ఆ అలవాటు లేదే, బిడ్డయేడుస్తున్నా, నేను వచ్చి లేపే దాకా లేచేదానివికావు.'

కోడలు పైత్యాన బడిందని, యేదోచూసి దడుచుకున్న దనీ అనుకున్న దత్తగారు. లేవదీసి తీసికెళ్ళి పైత్యం తకం నాకించింది, దిష్టితీసింది.

మరునాడు కూడా కోడలు, బెదురు చూపులా యేడుపు మొహమూ చూసి, కావుమ్మ మొగుడితోనూ కొడుకుతోనూ చెప్పింది.

జనార్ధనంగారు లేడీ డాక్టర్ని పట్టుకొచ్చాడు, ఆమె చూసింది, యేదో రాసి చీటీయిచ్చింది.

సుదర్శనం తేలిగ్గా అనేశాడు.

'అన్ని అలవాట్లు తగ్గించేసి, మానేసి యింట్లోనే వుంటుంటే చికాకూ, మొహం మొత్తి, వెర్రెత్తి వుంటుంది. గీతాపారాయనా, సుందరకాండ చదవటం చేయమను, రెండుపూట్లా స్నానం చేయమను.'

ఇట్లా అన్నాడేగాని, భార్యను వోదార్చి, మెస్మరైజ్ చేసి నీగుబులు మానుస్తాను అనలేదు. ఆ ప్రయత్నం చేయలేదు.

తల్లి దవడలు నొక్కుకుని వూరుకున్నది.

## 8

చంపకానికి మొగుడిదగ్గర చనువు యేనాడో తగ్గిపోయి ది ఇప్పుడు, భీతి, బిడియం పట్టుకున్నాయి. వాటిని జయించాలని చూస్తున్నది. అతని ఉదాసీనాత మరింతగా అనుభవానికి వచ్చి వుక్రోషం పుట్టింది.

వంట అయింది, అత్తగారు జపం చేసుకుంటున్నది. భోజనానికి రమ్మని పిలుచుకొద్దామని చంపకం సుదర్శనం గది లో అడుగు పెట్టింది.

అ కూచున్న తీరూ, అసాధనా చూసేప్పటికి వళ్ళు మండింది, నిలబడి అడిగింది.

'నిజంగానే మెస్మరైజ్ చేయగలరా మీరు? యెవడు కని బెట్టాడీ సాధనా?' అన్నది నవ్వుతూ.

"మెస్మర్ అనే వైద్యుడు, యమ్‌డి పాసైనవాడు కనిబె ట్టాడు. నేను సాధన చేసేప్పుడు నా యేకాగ్రతకి భంగం కలిగించవద్దని, నీకూ అమ్మకీ చెప్పాను. ఆవిడ చేయగలిగింది, నీవల్ల కావటం లేదా, యెంత గొప్పవిద్య, కృష్ణుడు మెస్మరిజం

హిప్నాటిజమ్ సాధన చేసే గొప్పవాడై నాడు. ద్రౌపదీమాన తక్షణ చేయగలిగాడు, వ్యాసమహర్షి ధర్మరాజు అజ్ఞానాన్ని తొలగించాడు. నాకు మనసు కుదురుగా వుండదు, నిర్మలంగా వున్నాదని మొదలుపెట్టగానే వచ్చావు, యోగవిద్య కష్టంగదూ" అతని గొంతు కఠినంగా మారింది, కళ్లల్లో తీవ్రతా కాంతీ హెచ్చినై.

చంపకం నవ్వుతూనే రెట్టించింది.

"యోగాభ్యాసానికి భంగం కలిందా?"

"కలగలేదూ? మనసు చెదిరిపోలేదూ? ఇంతకూ యేమి కావాలిప్పుడు నీకు? అదే అడుగు రెట్టించకు."

'ఒక నెలక్రితమేగా అక్కగారి చేతుల్లో డబ్బు కుమ్మరించారూ? మేనగోడలి పెళ్ళి కలవారితో సవ్యంగా జరిగిపోయెనూ మళ్లా యేం వుపద్రవమొచ్చిందని నమ్మి బావకోసం యాత్రై వేలకు హామీ వున్నారూ? ధరావతుకట్టి మేనల్లుడికి వుద్యోగం మీరే యిప్పించాలా యింకెవరూ లేరా?' తలుపుకి ఆనుకుని చేతులు వెనక్కు వుంచుకుని నవ్వుతూ అన్నది. సాధన మాన్పించాలని చంపకం తలంపు, లొంగుతాడా, మెత్తబడతాడా అని చూస్తున్నది.

'అదా దుగ్ధ, యేదో విధంగా ఆదుకుంటూ వుంటాడు కొడుకు, అనేగదూ పెంపుడిచ్చిందీ? నా వాళ్ళకు నేనే కనిపించటంలో వింతలేదు, నీవాళ్ళకూ నేనే యెందుకు గుర్తువస్తానూ? నవ్వు

జబ్బు పడ్డావనీ, ప్రసవాని కొచ్చామనీ అంతమంది రావాల్సిన అవసరమున్నదా? అన్నేసి రోజులుండాలా, మీ అవ్వగారికి నా మెస్మరిజమే యెందుకు నచ్చింది? డబ్బు పుష్కలంగా వున్నది మనదేం వదలదని గదూ వస్తుంది. మా నాన్నది సెంటు భూమి నేను అమ్మలేదు, మా అమ్మకి తెలియకుండా యెవరికీ యేమీ ముట్టజెప్ప లేదు; వాళ్ళిద్దరికీలేని దుగ్ధ నీకేయెం దుకు పట్టింది? మీవాళ్లు నావల్లే యేమీ చేయటంలేదే? వాళ్ళ ఆస్తంతా యెందుకు హరించుకు పోతున్నదీ, మీ అన్న యేమీ చేస్తూ వుంటాడో ప్రశ్నించావా?' కొంత వుధృతం తగ్గింది. సంబాళించుకోవాలని చూస్తున్నాడు.

చంపకం చెదరలేదు. 'ప్రాణబిక్ష పెట్టమని అందమైన ఆడవాళ్లే వయసులో వున్నవాళ్లే యెందుకొస్తారూ? ఆస్పత్రి వున్నదిగా, ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకునే డాక్టర్లున్నారు వాళ్ళు దూరి వాళ్ళ నిద్రాభంగం చేయలేరా? ఆస్పత్రిలో ప్రాణాలు తీస్తారా యేం? డాక్టర్లు విషంపోస్తారా?' అన్నది.

వెళ్ళిపోతుందని సుదర్శనం తలిస్తే, తాకాల్సిన చోట దెబ్బ తీసింది పెళ్లాం. అతని మొహం యెఱ్ఱనై బిగిసిపోయింది కళ్లు విచ్చికాంతి నిండి మెరిసినై. కన్నార్పకుండా చూశాడు.

"ఎంత అహం! నేనూ నిన్ను అడుగుతాను. తెల్లవారే వరకూ మా అన్న యింట్లో శయనించి నిద్ర దీసినప్పుడేం జరిగింది? చెప్పు. ఇంటికి వేంచేసేందుకు వాడూ వాడి కారూ

తప్పితే నీకింకెవరూ అందలేదంటే నమ్మనా? వాడు చిత్తుగా తాగుతాడనీ, తాగిస్తాడనీ, నేర్పుగా తాగించి స్త్రీలను భంగపరుస్తాడనీ, యేపాపమూ చేయనివాడి లాగా మరునాడు మర్యాదగా ప్రవర్తించగలడనీ, మున్సిపాలిటీలో వుద్యోగం చేసే స్త్రీల మొత్తు కోళ్లు వినలేదూ? పసి పాపవా? దొంగనోట్ల నేరంలో యిరుక్కున్నాడని తాజా వార్త అందలేదూ నీకూ? చెప్పడా? చెవులల్లో వేళ్లుంచుకున్నావా? మెత్తని కత్తిలాటివాడితో సరసమా నీకూ?"

చంపకం, మొగుడిమాటలకు ఆశ్చర్యపోతూ వెనకనున్న చేతులు తీసింది. వెళ్ళిపోవాలను కున్నది. సుదర్శనం నిటారుగా నిలబడ్డాడు. దీపం వెలిగింది, ఆ కాంతి అతని మొహం మీదపడి, తెల్లని వెలుగులో వింతగా కనిపించాడు. నిజంగానే మెస్మరిజం అనేది వున్నదేమోనని భయం కలిగింది కదలలేకపోయింది. బొమ్మలాగా నిలబడింది.

'మా దర్శిద్! నన్ను నిగ్గదీయమనీ, కించపరచమనీ సలహా వాడే యిచ్చాడా నీకూ? ఇస్తే మాత్రం నీస్తోమతయెంత? నీ కన్నవారు దోపిడీ హత్యలూ చేయిస్తున్నారు, భార్యవని నిన్ను నేను మన్నించలేదా, ప్రేమంచ లేదా? అనుమానించి గుడ్డి ప్రశ్నలేశానా? ఒంటెడు నగలున్న నువ్వు భావదారిద్ర్యంతో బాధపడుతున్నావు. లోకం తీరుతెన్నులు తెలియని అర్భకురాలివి. డబ్బు శాశ్వతమా? డబ్బు రక్షిస్తుందా? ఛాం చేత!

బంక మెదడు, మొగుడనేభయం, భక్తి గౌరవం నీకున్నాయా? యేది యెత్తరాదో అది యెత్తి నన్ను కించపరిచావు. డబ్బు రక్షిస్తుందో, మనిషి రక్షిస్తుందో యిప్పుడే చూపిస్తా.'

రెండు వందరూపాయల నోట్లు లాల్చీ జేబులోంచి తీసి చంపకం మొహాన విసిరాడు.

'అవిగో నీ బావ చైర్మన్ నీ పిల్లలకిచ్చిన నోట్లు' లిప్త కాలంలో మీదకొచ్చి చెంపలూ మొహమూ తలా అందిన చోటల్లా బాదసాగాడు. అతనివి పల్చని చేతులు పొడవైన సన్నని వేళ్ళు తప్ తప్మని చప్పుడు, చంపకం వేసిన కేకలకి, కావమ్మ పరుగెత్తు కొచ్చింది. చంపకం వేపువారు పక్కయింట్లో నించి అప్పుడే వచ్చారు, ఇది చూశారు.

ముందు కావమ్మ తన బలమంతా వుపయోగించి కొడుకును లాక్కెళ్ళి సోఫాలో కూదేసింది. చంపకాన్ని అన్ని వేపులా ఆనుకుని వాళ్ళవాళ్ళు తీసికెళ్లారు.

కావమ్మకి ఆపకుండా కన్నీళ్లొచ్చినై. చల్లని నీళ్ళుతెచ్చి కొడుకు మొహాన బాగా చల్లింది. తడితువాలా తలమీదుంచింది. చేతుల్లో తడి గుడ్డలుంచింది. ఆయాసంతగ్గి నిబ్బరంగా నిలబడి అన్నది.

'ఒరే! నాయనా! ఆడది తప్పుచేసినా క్షమించాలి, గౌత ముడంతటివాడు క్షమించాడు, దాని కర్మ అదే అనుభవిస్తుంది అనుకోవాలి. దాయాదులదిష్టి కళ్ళు నీమీద పడ్డాయిరా సుదర్శ నం, నేను మొత్తుకున్ననాడే చెవినివేసుకుంటే బాగుండిపోయేది'

ఇస్త్రీ తువాలు తెచ్చి మొహం చేతులూ తలా తుడిచింది, విభూతి మొహాన పెట్టింది.

"ఆయువు పట్టున తాకికే హత్యా పాతకం చుట్టుకోదా సుదర్శనం, యేమన్నది? విననట్టు వుండిపోతే సరిపోయేదే. తగ్గిందా? నేను కావుమ్మను."

కొడుకు మొహాన నవ్వు వెలిసింది.

నిర్మలంగా చూస్తూ చెప్పాడు. "నేను పరస్త్రీలతో పోతు న్నాననీ, డబ్బంతా దుర్వ్యయం చేస్తున్నాననీ నిందించి దమ్మా. బుద్ధి చెప్పాను."

కింద కూచుని కొడుకు కాలిమీదరాస్తూ తల్లి అన్నది.

"బుద్ధి చెప్పిన పద్ధతి బాగా లేదురా, ఒక్కనిజం గమనిం చు. ఒళ్ళప్పగించిందేగాని, ఒక్కటంటే ఒక్క దెబ్బ యెదురు తిరిగి నిన్ను వేసిందా సుదర్శనం? కోపంతో పిచ్చివాడివై ఒళ్లు మరిచావే. ఆడదానిమీద చెయ్యి చేసుకుంటే ఆ యింటి లక్ష్మి నడిచిపోతుంది."

# 9

చంపకం ఆత్మీయులు చంపకాన్ని సుబ్బారావు యింటికి మోసుకెళ్ళారు. మెత్తని పక్క మీదుంచి ఉపచారం చేశారు. కళ్లొత్తుకుంటూ, చీదుతూ, జరిగినదానికి చిలవలూ, పలవలూ కల్పించి రాద్ధాంతం చేశారు. వైద్యుడొచ్చి వెళ్ళాడు.

చంపకాన్ని అనుకుని కూచుని కాఫీ తాగిస్తూ అప్ప అన్నది "పిచ్చి వున్నదే నీమొగుడికి చంపకం. ఆ కళ్ళల్లో వెలుగూ తీవ్రతా చూశావా, అదే సమయానికి మేమున్నాం గనక సరిపోయింది. నయం, చంపాడు గాదు, అవేం కేట్లే? మేమెవరి నోటా వినలేదు, పిచ్చివాడు కాకపోతే, పొద్దున్నే యెవడో తల కుమాసిన వాడొచ్చి దీనాలాపాలాడితే, నమ్మి అయిదువేలూ చేబదులిస్తాడా?"

చేబదులు తీసుకున్నది, కాలేజీ ప్రిన్సిపాల్.

సుబ్బారావు కడుపులో నించిపొంగి వచ్చే ఆనందాన్ని అణిచిపెట్టి, బోలెడు సానుభూతి వెల్లడించాడు. తన తమ్ముడికి సంస్కారం లేదన్నాడు, తొందరపడ్డాడు అన్నాడు. భార్య విలువ తెలిసి రావాలన్నాడు.

"బాగా చెప్పారు అల్లుడుగారు" అని వంతపాడారు చంపకం వేపువారు.

చంపకాన్నీ పిల్లల్నీ తమతో తీసికెళ్లానికి తీర్మానించారు. సుబ్బారావు బాగా సాయం చేశాడు ప్రయాణానికి. కావు మ్మ పిన్నికి నచ్చచెప్పి ఒప్పించ గలిగాడు.

సుదర్శనంలో చలనం కలగలేదు, యేలోటూ తెలిసి రా లేదు, ఊపిరి సలిపినట్టు ఫీలయాడు. యేకాగ్రత నిలిపేందుకు చాలా టైమ్ అందింది. యేనాడు యెవరి బాధ తీసేసినా, యెవరినాదుకున్నా అతని మొహం సంతోషంతో వెలిగిపోయేది.

నగరాభివృద్ధి సంస్థలో సుబ్బారావు మెంబరు. మీటింగు వున్నదని పట్నం వెళ్లాడు, శశి యిల్లు, పిల్లల్ని చూసుకుంటూ వెళ్ళలేదు. కొడుకు శివకుమార్ అడి అడి వచ్చి కడుపునెప్పి అన్నాడు. కాళ్లు బాగయేప్పటికే మూడేళ్ళు పట్టింది. మళ్లా యేమి జబ్బు వస్తున్నదోనని శశి భయపడింది మరికాసేపటికి పోట్లు మొదలుపెట్టి, మాటలు పుట్టినై. వళ్ళంతా చమటలుపట్టి పిల్లవాడు తన్నుకోసాగాడు. మరికాసేపటికి కళ్ళు తేలేశాడు. డాక్టరువచ్చి వెళ్ళాడు. యేమీ తేలలేదు. పిల్లవాడు కలకడు. శశి యేడుస్తూ కొడుకిని రెండు చేతులమీదా పెట్టుకుని, సుదర్శనం ఖింటికి వచ్చింది. సాయం సమయం.

అత్తగారు కావమ్మ శశిగోడు విన్నది.

"అబ్బాయి స్నానం చేస్తున్నాడు. సోఫాలో కూచోమ్మా" అన్నది.

అయిదు నిమిషాలకి సుదర్శనం, తెల్లని లాల్చీ పైజామాతో, తడిసిన నల్లని జుట్టు దువ్వి, శాంతం వుట్టిపడుతూ, నవ్వు ముఖంతో వచ్చాడు.

శశినీళ్ళు నిండిన కళ్ళతో, వణికేగొంతుతో అంతా వర్ణించి చెప్పింది, చేతుల్లో పిల్లవాడున్నాడు.

తుంగచాప, దానిమీద ఖూరుగు దూదిపరుపు, దానిమీద తెల్లని దుప్పటీ వేయించి, పిల్లవాడిని వెల్లకిలా పడుకో బెట్టాడు సుదర్శనం.

నలుపలకల చిరిచాపమీద తాను పద్మాసనం వేసుక్కూచున్నాడు. అయిదు నిమిషాలు గడిచినై. శివకుమార్ ముఖానికి మంచి రంగువచ్చి మామూలుగా వూపిరి తీసుకున్నాడు. మరో పది నిమిషాలకి, కళ్లు విప్పి తల్లిని చూసినవ్వాడు. శశి కళ్ళు తుడుచుకున్నది.

'తగ్గింది వదినా, తిన్నదేదో అరగటంలేదు. మరో పది నిమిషాలుంచి, తీసికెళ్ళచ్చు' అని లేచాడు సుదర్శనం.

జుట్టు ముడేసుకున్నది శశి 'నీ ఋణం తీర్చుకోలేను మరిదీ' అన్నది తడి కళ్ళతో నవ్వుతూ.

'మందు వాడాము, ఆపేయనా?' అన్నది.

'ఆపేయక్కర్లేదు. అదేదో అరుగుదకిచ్చి వుంటాడు వాడచ్చు.'

## 10

సుబ్బారావు, పట్నంనించి రాగానే, శశి గొప్ప , శేతులా కళ్ళూత్తివ్వతూ అంతా చెప్పింది.

'ప్చ! విశేషమేమున్నదీ? మందు వేశాకగదా వాడిదగ్గర పని చేయటం మొదలుపెట్టి వుంటుంది' అని చెయ్యితిప్పి తేల్చేశాడు సుబ్బారావు.

శశికి నమ్మకం కలిగింది, సుదర్శనమే బాధ తగ్గించా డని వాదించింది. తన నమ్మకాన్ని తగ్గించుకోలేదు, ఓ నెల గడిచింది, సుదర్శనమింట్లో సందడి వినిపించింది, చంపకాన్నీ పిల్లల్నీ, వాళ్ళవాళ్లు తెచ్చి దింపి వెళ్ళారనుకున్నది శశి.

చంపకంతో, తనకొడుకుబాధ నిమిషాలమీద తగ్గటం వర్ణించి చెప్తే యెంత గర్వపడుతుందో ననిపించింది. తీరా వెళ్ళిచూస్తే తోటికోడలు రాలేదు, వేరేయెవరో చుట్టాలు వచ్చి వెళ్ళారని అత్తగారు చెప్పింది. శశికి విచారం కలిగింది.

'మీరూ మామగారుగానీ, మరిదిగానీ వెళ్ళి తీసుకు రారా? వాళ్లు మూర్ఖించారేమో!' అన్నది.

అత్తగారు కావుమ్మా విచారంగానే జవాబిచ్చింది.

"యేం చెప్పమంటావు కోడలూ! పిల్లలు లేక యిల్లు చిన్నబోయింది. వెళ్లి తెద్దాము, అని తండ్రీ కొడుకులతో అని చూశాను. 'రావాలని దానికి తెలియదా? నీకు విశ్రాంతిగా వున్నది. నా ప్రాణం తెరిపినబడింది' అన్నాడబ్బాయి. అంతేనా 'ఇది వినమ్మా నా స్టూడెంటుకి మత్తుమందులు అల అలవాటయి, ప్రాణం మీదికి తెచ్చుకున్నాడు. తల్లిదండ్రులకి చెప్పటానికి భయపడిపోయినాడు. తనగోడు నాతో చెప్పుకుని మాన్పించగలరా అని యేడ్చాడు. మాన్పించగలిగాను. అంతా తనవాళ్ళతో చెప్పాడు. తనంటి అబ్బాయిలింకా వున్నారన్నాడు, మెడిటేషన్ సెంటర్ పడుతాము, మేముగూడా మీ విద్య నేర్చు

కుంటామన్నారంతా.' వాడు చెప్పినదేమిటో నాకర్థం గాలేదు. భార్యని దిద్దుకురావద్దా ముందు" అంటూ సంశయిస్తూ చెప్పటం మానేసింది. మీరేకారణం అని మొహంమీదెట్లా అంటుంది?

శశి వూరుకోలేక మరోసారి వచ్చింది, మళ్లా అడిగింది. కావమ్మ విచారంగానే చెప్పింది.

'మామగారు వెళ్ళి వచ్చారు కోడలూ, దెబ్బలు తాకినప్పుడు బొమిక చిట్లిందిట, బాగానయమయాక పంపుతాము అన్నారుట కన్నవారు. కోడలు కంటబడలేదుట.' 'యేమి కానున్నదో' అని గొణుక్కున్నదత్తగారు;

# 11

యెద్దుపుండు కాకికి రుచి అన్నట్టు ఒకరి కుటుంబకలహం మరొకరికి లాభిస్తుంది. అన్నదమ్ములంటి యూదులు అరబ్బులు కొట్లాడుకుంటే లాభించేది మారణాయుధాలమ్మే వాడికి. అది తెలిసి గూడా ఆయూధాలు కొనుక్కుని మరీ కొట్లాడుకుంటారు.

చంపకానికి యింటికి పోవాలని పీకుతున్నా, తనవారు తన పక్షం పలికిన మాటలే యింపుగా తోచాయి.

"అడదానిమీద చెయ్యి చేసుకుంటాడా! మళ్లాచూస్తే పేద్ద చదువు చదివాడు! వాడేవచ్చి తీసికెళ్లాలి. కాళ్ళబేరానికి రావాలే చంపకం. మళ్లా చెయ్యి చేసుకోను అని వాళ్లన్న లాయరు సుబ్బారావునితెచ్చి వాడియెదుట ప్రమాణంచెయాలి" అన్నారు.

'నువ్వే తర తరలాడుతూ పోతే, వాడికి నీ వాలువ యేం తెలిసివస్తుందీ?' అని విధవప్ప అన్నది.

చంపకం కన్నవారి కెప్పుడూ కోర్టువ్యవహారాలే. తగాదా లో వున్న భూమి చౌకగా వచ్చిందని కొంటారు, లేదా, యెక్కువ వడ్డీకి అప్పు తెస్తారు, అది పీకలమీదికి వస్తుంది. లేదు అనలేక ఒక్కొక్క నగే యిచ్చింది చంపకం. అత్తగారూ, మామగారూ, నమ్మకస్తులద్వారా పంపేడబ్బు యింట్లోనే యిచ్చింది, మందులు కొనలేదు, వైద్యమూ లేదు, చంపకానికి డబ్బు యిచ్చింది తెలిసిరాలేదు. మొగుడు వచ్చి "ఆ సాధన మానేశాను" అనగానే అతనితో వెళ్ళిపోవాలని ఆశిస్తున్నది, తీరికగా కూచుని, అతన్ని గురించి ఆలోచిస్తే, సరదాలులేవు, జీవితం ఎక్సైటింగా వుండదు, గాడిన బడిపోయే ఒంటెద్దు బండిలాగా వుంటుంది; తనకు ఆనంద మిచ్చిందీ, తనను రక్షింపజేసిందీ బావగారే; సుబ్బారావు గుర్తురాగానే చంపకం వళ్లు జలదరించింది. ఆ రెండో తైనాతీ వెధవ దొంగ బుద్ధులూ, సైత్యమూ చీదర, రోత పుట్టించినై. సుబ్బారావు వచ్చి వెళ్లాడట, తను తలుపుగడియ పెట్టుకుని నిద్రపోతున్నది తనవాళ్ళు మంచివాళ్ళు గనక లేపలేదు పైగా, సుదర్శనం అక్కడ వుద్యోగం మానేసి, తల్లిదండ్రులను వదలవస్తే, యిక్కడ కాలేజీ ప్రిన్సిపాల్ రిటైరౌతాడు, ఆ పని యిపిస్తాము అన్నారుట, చంపకానికి మాటలింకానిచ్చినై. సుదర్శనం ఒప్పు వచ్చేస్తే బాగుండు, బావగారి పీడ వుండదు అనుకున్నది. తెలివితక్కువగా అక్కడికి వెళ్తే సుబ్బారావు

తనని యింకెతమంది కందిస్తాడో! శశి మంచిగా వుంటుంది గనక వెళ్ళక తప్పదు, వచ్చి పిలుచుకెళ్తుంది శశి.

పిల్లలు బడికి వెళ్ళివస్తున్నారు, ఆటల్లో, యింటి మాట యెత్తటంలేదు, యెప్పుడన్నా యింటికి పోదాము అని తల్లితో అనినా అప్పటికేదో చెప్పి పంపించేస్తుంది. ఆశ పీడుస్తూనే వున్నది. మొగుడు రానేలేదు. అతన్ని నేర్పుగా ఒప్పించి తెచ్చేద్దామని వెళ్ళినబంధువులు, అతన్ని కేలేకపోగా, దుర్వార్త లు తెచ్చారు అత్తమామలు వూళ్ళోలేరనీ యాత్రలకి వెళ్ళారనీ చెప్పి, సుదర్శనం మొహమెత్తి మాట్లాడలేదన్నారు.

సుబ్బారావుని సంప్రదించారుట, మధ్యవర్తిగా వుండి తమ్ముడిని పంపమన్నారుట. సుబ్బారావు యిచ్చిన సలహా చెప్పారు.

'నీ బావగారు చెప్పింది బావున్నదమ్మాయ్! ఊరికే భయపెట్టడానికే నన్నాడాయన, అమెస్మరిజం పిచ్చి వదిలించటానికే యీ యెత్తు అన్నాడు.'

చంపకం చీర అంచు కుట్టుకుంటున్నది. తలెత్తకుండానే అడిగింది. "యేమని సలహా యిచ్చారు?"

'సరిగ్గా విని మరి, ఆస్తంతా దుబారాచేస్తూ, ముగ్గురు పిల్లలకీ యేమీ లేకుండా చేస్తున్నాడు, అమాయకుడని తెలుసుకుని, దానధర్మాలు మితిమీరి చేయుటంచూసి, కన్నవారూ

అందినంత పట్టుకుపోతున్నారు. కనుక ఆస్తి నీపేర పెట్టించమని పిటీషన్ పెట్టించమన్నాడు. యెవరూ కోర్టుకెళ్ళనవసరం లేకుండా వ్యవహారం నడుపుతాడుట, ఈ దెబ్బతో తలతిరిగి నో ట్లో కి ముద్దరావాలి,'

తల వూపుతూ వింటున్న చంపకం తల్లెత్తి అన్నది.

"సలహా బాగానే వున్నది వినటానికి, వికటిస్తుండేమోనని భయంగా వున్నది. తిక్కరేగితే యే అఘాయిత్యం చేస్తారో చెప్పలేము" అని పంటితో దారం తెంపేసింది.

"యేం చేస్తాడూ వెర్రివాడు? పరుగెత్తుకుంటూ వచ్చి, నిన్నూ పిల్లలనూ లాక్కుపోతాడు, నీ అత్త మామలకూ పట్టుదలే యాత్ర చేయుటమే పరమార్ధమనుకున్నారుగాని, అతన్ని వెంట బెట్టుకొచ్చి, నిన్ను తీసుకెళ్ళలేదు గమనించావా?" విచారంగా చూసింది చంపకం. తల అడ్డంగా తిప్పింది.

"కొడుకంటే ప్రాణం, అయనికిష్టంలేని పని చేయరు."

"నీ విచారం చూస్తే, నీకే వెళ్ళిపోవాలని తహ తహగా వున్నట్టున్నదే, అంతగా వెళ్ళిపోవాలనుంటే మేం గూడా తోడు వస్తాం పద." తోడబుట్టినవాళ్ళు పక పకా నవ్వారు.

"యెవరికంపు వారికింపు" అన్నది పెద్దక్క.

"సత్యభామ లాగా యెదురు చూస్తున్నది." వదిన నవ్వింది.

'నష్టపోయేది నేనేగా, ఆయనకు బాగానే పొద్దుపోతుంది.' చంపకం గొణుక్కుంటూ, చేతిలోవి కింద వదిలేసి, కళ్ళుతుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది.

## 12

తల్లీ దండ్రీలేరు, మిత్రులూ, శిష్యులూ యింట్లో చేరి సుదర్శనానికి కంపెనీ వుండేట్టు చూశారు.

ఆరోజు సుదర్శనం, వరండాలో వచార్లు చేస్తుండగా చేతికి సమనులందినై. నిలబడిపోయి, ఆవాక్కయినాడు, మొహం వెల్లనైంది. కత్తికాటుకు నెత్తురుచుక్క లేదు.

మిత్రులొచ్చి యేమిటన్నారు, చేతులోని కాగితాలిచ్చాడు చదివి ఆశ్చర్యపోయారు. అతన్ని యింట్లోకి తీసికెళ్ళి వుపచారం చేశారు. ఒకతను వెళ్ళి సుబ్బారావును పిలుచుకొచ్చాడు.

లోపలినించి పొంగి పొరలివచ్చే సంతోషాన్ని అణిచిపెట్టి సుబ్బారావు పైకి కోపం, ఆదుర్దా, విచారం అభినయించాడు. తమ్ముడిచేత బ్రాందీ తాగించాడు.

సభికులను చూసి అన్నాడు.

"మా మరదలుకి మొదటినించీ డబ్బుమీదే గౌరవమని చెపుతూ వచ్చాను సుమండీ. పిన్నీ, బాబాయీ, వీడూ నన్ను నమ్మలేదు. యెందుకని? నేను జ్ఞాతిని. నాకు యీసూ అసూ

యా అని తేల్చారు. నా తమ్ముడామె అడిగిందే తడవుగా చేతి లో డబ్బు కుమ్మరించేవాడు. రెండు చేతులా ఖర్చు చేయటాని కలవాటు పడిందామె" అని కాగితాలు తీవ్రంగా చూస్తూ 'ఈ సలహా యిచ్చిన లాయరెవడో. అది అమలు జరిపిన ఆమె స్వంత మనుషులకెన్ని గుండెలు? ఇక్కడెవరూ లేరనుకున్నారు గాబోలు. వీళ్ళ అంతుచూస్తాను. వీడి ఆస్తిమీద కన్నుబడింది వాళ్లకి. అక్కడేదో పెద్ద వుద్యోగం యిప్పిస్తామనీ, నా తమ్ము డిని తీసుకురమ్మనీ నాకు వార్త పంపారు వాళ్ళు. ఇవన్నీ పిన్నీ బాబాయీ లేనప్పుడే జరిగాయి, చిత్రంగా లేదూ!" అంటూ కోపంగా చూచాడు.

చంపకానిదే తప్పని తేల్చారు, సుబ్బారావు, తమ్ముడిని తన యింటికి తీసికెళ్లాడు. సుదర్శనం కిమ్మనలేదు. రానన లేదు. యెవరినీ దూషించలేదు. చేసే సేవ అందుకున్నాడు. పెట్టిన భోజనం తిన్నాడు.

సాయంత్రం ప్రేయరు చేసుకున్నాడు. ఒకరిద్దరు ఆర్తిలో వున్నవారొస్తే బాధతీసేసిపంపాడు. స్నానమయింది.

శశి వదిన చనవుగా ప్రేమగా అడిగింది.

"నేను పోయి చంపకాన్ని తీసుకురానా?"

సుదర్శనం కళ్లు పెద్దవైనై. కళ్లలోకి యెర్రగీతలొచ్చి నై. తల అడ్డంగా తిప్పాడు, తీక్షణంగా చూశాడు, కూచున్న వాడు కూచున్నట్టే కదలిక లేకుండా వుండిపోయాడు.

శశి అర్జంటుగా డాక్టర్ని పిలిపించింది, డాక్టరు చూశాడు పలకరించాడు, పరిక్షించించాడు.

'బాగా షాక్ తాకింది, ఇష్టంలేని సంగతి యెత్తకండి. ఆయన బాగా విశ్రాంతి తీసుకోవాలి. దేశసంచారం చేసి వస్తే కొంత విశ్రాంతి మెదడుకి దానంతటదే వస్తుంది. ఇవాళ్టికి ఆయనమానాన ఆయన్ని వదిలేయండి.' అని వెళ్ళిపోయినాడు.

ఆనాటికి భోజనం నిద్ర లేవు.

మరునాడు యింటికి పోతానని బయలుదేరాడు.

శశి యెదురుగా వచ్చి, 'భోజనం మాయింట్లోనే చేయాలి రాకపోతే నేనే తెస్తా' అన్నది.

'అలాగే' అంటూ తలొంచుకుని వెళ్ళిపోయాడు.

తరవాతేం జరిగిందీ వివరంగా యెవరికీ తెలియదు. ఇంటికి తాళం పెట్టాడు, తాళంచెవి వదినకివ్వమని, పనిమనిషి శాయమ్మకిచ్చాడు.

మంచి బట్టలేసుకుని కాలేజీవేపు నడిచివెళ్తూ కనిపించాడని ఒకలిద్దరు చెప్పారు, వెంట స్టూడెంట్సు వున్నారట. క్లాసు తీసుకున్నాడని వో విద్యార్థి చెప్పాడు. బంట్రోతు చూశానన్నాడు.

ఆ సాయంత్రం అతనింటికి రాలేదు, ఆ రాత్రికి చూశారు భోజనానికి రాలేదు. ఆ తరువాత అతనెవరికీ కనబడలేదు. అందలేదు.

చంపకాన్ని తేవటానికి సుబ్బారావూ శశి వెళ్లారు.

# 13

రెండు రోజుల తర్వాత, తాళంతీసి లోపలికి వెళ్లారంతా, ఇల్లంతా నీటుగా సద్ది వున్నది. బల్లమీద పూలవాజు కానించి కవరు కనబడింది. లోపలి వుత్తరం తీసి, వణికే చే తు ల తో, అదిరే గుండెతో, తలలో పెద్దమోతతో చంపకం చదువుకున్నది.

"చంపా!

నీకోరిక ప్రకారం, నా చరాస్థి, స్థిరాస్థి నీకు చెందెట్టు, దానపట్టా వ్రాసి, లా ప్రకారం, సాక్షి సంతకాలతో సహా, రిజిష్టరు చేయించాను. ఇనప్పెట్టెలో కవరున్నది, తీసుకో. నీకు కావాల్సింది నీకు చెందుతుంది. నీకు దక్కినది నీవు కాపాడుకొనగలవా అనేది అనుమానస్పదం. ఇటువంటి స ల హా నీకు యిచ్చినవారి భవిష్యత్తూ, అది అమలు జరిపించినవారి ముందు గతీ యెలా వుండబోతున్నదీ తలుచుకుని విచారించాను.

నాకోసం వెతకవద్దు, వెతికించవద్దు, నాకింక ఆస్తి పాస్తులు లేవుగనక నీకింక పనికిరాను. నాకు విలువ లేదు.

తాత్కాలికోద్రేకంలో నేను చేసినదానికే, నాకు శిక్ష పడింది. నువ్వు బాగా ఆలోచించి చేసిన యీపనికి నువ్వేమౌతావో అనేదే విచారకం నా ప్రేయసికి, సాధనకీ అడ్డురావద్దనే వాడిని, నువ్వు వినలేదు, ఫలితం చూశావు, అట్లాగే నా కో స ం రావద్దని చెప్తున్నాను. నువ్వేదైనా పాటించాలి. నా మీ ద

నమ్మకమూ గురీ వున్న వాళ్ళే నా సహాయం కోరతారు. వారిక దివ్యకమానను. అది నాతత్త్వం, నాదారి కడ్డు రావద్దు.

దూరమైపోతున్నా

సుదర్శనం."

మొగుడొచ్చి బతిమాలి తీసికెళతాడు, లేదా అత్తమామలు వచ్చి 'నీయింటికి నువ్వురావాలి. ఒకళ్లు పిలవాలా?' అంటారనే కల కల్లకాగా, దారుణమైన మాటలువాడి వ్రాసిన వుత్తరం చదివి నేల కూలింది చంపకం, యేడుపు పెల్లుబికి రాలేదు. గొంతులో కాగితపు వుండ అడ్డుపడినట్టుగా వున్నది.

మొదటిసారి కళ్ళెత్తితే కంటబడింది చైర్మన్ సుబ్బారావు బావగారు. అతన్నిప్పుడు చంపకం ఎర్రరే కళ్ళతో చూడగలిగింది. వయోముఖ విషకుంభం కళ్ళల్లో దోబూచులాడే, అసూయా ఆ చిరునవ్వు వెనకదాగిన విషపు ఆలోచనలూ అర్థమైనై. గదంతా గిర్రున తిరగసాగింది.

సుబ్బారావు చంపకం జారవిడిచిన వుత్తరం అందుకుని అందరికి వినబడేట్టు పైకి చదివాడు.

అందరూ తలా ఒకమాటా అన్నారు.

"ఊరికేనే బెదిరిస్తూ రాసివుంటాడు, రేపీపాటికి అన్నానికి అలమటిస్తూ, పెళ్లాంకోసం వెతుక్కుంటూ రాడూ? బైరాగుల్లో కలుస్తాడా? నక్సలైటా?" మరొకరు "వెతకటానికి వెంటనే మనుషుల్ని పంపండి" అన్నారు.

'పోలీసులకి రిపోర్టివ్వండి.'

"తల్లి దండ్రులకి తెలియజేయండి, వాళ్లువెళ్ళి ప్రాధేయ పడితే వస్తాడు. తండ్రి అంటే చాలా గౌరవం."

కన్నవారు 'మనింటికే పోదాం రావే చంపకం, నిన్ను కాలు కిందపెట్టనీయం, పువ్వుల్లోపెట్టి పూజిస్తాం. ఇక్కడుంటే నిన్ను బతకనిస్తారా? దుమ్మెత్తి పోస్తారు. పీక్కు తింటారు" అన్నారు.

అందరి మాటలూవిని, అందర్నీ కలయజూశాడు సుబ్బా రావు. తన మీదే కళ్ళుపెట్టి చూస్తున్న మరదలితో అన్నాడు.

"మనిషెక్కడున్నదీ, సిఐడీల్ని పెట్టి కనుక్కొని చెప్తాను. వెళ్ళి కాళ్ళూ గడ్డాలు పట్టుకుని తెచ్చుకో, నీ ఆస్తి చూసి, గద్ద లూ, రాబందులూ చేరాయప్పుడే."

చంపకం వేపువారు మండిపడ్డారు, కల్లుతాగిన కోతులల్లే చిందులు తొక్కారు. సుబ్బారావుమీదికి పోయి పొడుస్తూ, దెప్పారు.

'నువ్వు పత్తిత్తువా? నువ్వుగాదూ యీ పెటకం పెట్టిందీ? నీకళ్లు చల్లబడిసై, కడుపులోమంట తగ్గింది. తనకోసం రావద్ద న్న తరవాతవస్తే, ఆ ముక్కోపి చంపేయడూ మా అమ్మాయి నీ. అందులో యేం సందేహం లేదు, పిల్లల్ని తల్లిలేని వాళ్ళను గూడా చేయదలచుకున్నావా?'

సుబ్బారావు మందహాసంచేసి జవాబిచ్చాడు.

"నేను లాయర్ని, నాకు అధికారమున్నది. చంపకం బాగుకోరే యిచ్చానుసలహా. నా స్వలాభ మేమున్నదిందులో."

నేలమీద పడివున్న చంపకం చివ్వన లేచింది. పిచ్చి దానిలాగా కళ్ళు పెద్దవిచేసి చూస్తూ వెళ్ళి, సుబ్బారావు చొక్కా పట్టుకుని గుంజుతూ,

'యెందుకు లేదూ? తమ్ముడిని పిచ్చివాడిని చేసి, మరదల్ని వీధిమనిషినిచే బ్లాక్‌మెయిల్ చేస్తూ గుప్పిట్లో పెట్టుకుందామని చూస్తున్నావు.'

వాళ్ళ వాళ్ళు చంపకాన్ని లాగేశారు.

పిల్లలకిదేమో అర్థంగాక యిల్లంతా తిరిగారు. తండ్రీ, తాతా, నానమ్మా కానరాలేదు. జరిగే రగడ అర్థంగాలేదు. తల్లి చీరలాగుతూ,

'నాన్నా, తాతా, నానమ్మా యేరీ?' అనడిగారు.

'నన్ను నాఖర్మకి వదిలేసి వెళ్ళా' రని చెపుతూ చంపకం స్పృహ తప్పి పడిపోయింది.

తల్లి కూతుర్ని ఒళ్లో చేర్చుకున్నది. తల నిమురుతూ కన్నీళ్ళు కార్చింది. పిల్లలను దగ్గరకి తీసుకుని అన్నది.

'మీ నానమ్మకూ, తాతకూ మీ మీద లేదు. మా దగ్గరే వుందురుగాని.'

## 14

చంపకం ఆస్తి చదలు తినసాగినై. ఎన్నాళ్లు దుయ్యి పట్టగలరు? నిజం నిటిలి మీద తేల్తుంది. కొంత లోకానికి వెర వాలి. మా తప్పులేదని చూపాలి. కనక, కన్నవారు పెద్ద మను షుల్ని పోగుచేసి,

'వచ్చి కోడల్నీ పిల్లల్నీ తీసికెళ్ళింది. మీవద్ద వుంచు కోటం మీకు భావ్యం. మొగుడెక్కడున్నదీ తెలియక, చింతతో మంచమెక్కింది కోడలు ' అవి చెప్పమని భద్రాచలం రాయ బారం పంపారు.

'ఏక క్రియా ద్వ్యర్థకరీ' అని పెద్దమనుషులు రాయబారా నికి డబ్బు పుచ్చుకున్నారు, భద్రాచల క్షేత్రం దర్శించారు. సీతారామ దర్శనం అయింది.

"అబ్బాయి జాడ తెలిసిందా!" అంటూ చల్లగా మొదలెట్టి దౌత్యం నెరపారు.

జనార్ధనంగారు తలపంకిస్తు నవ్వుతూ విన్నారు. చిరు నవ్వుతోనే జవాబిచ్చారు.

"మా వాడు మాక్కూడా తెలియజేశాడు. 'మనసు విరి గేనని' అని సామెత. వాడులేని యిల్లు యిల్లా? రుద్రభూమి అని కోడలికి తెలియదూ. మంచం దిగి, డబ్బు వెచ్చించి, మొగుడెక్కడున్నదీ తెలిసికోవాలి. లాయరు చెప్పినట్టు నడు చుకోవాలి. ధర్మం తెలియని నాడు, న్యాయమైనా పాటించాలి.

అపాటి వయస్సుకి అమాత్రం జ్ఞానమైనా వుండాలని కోడలితో చెప్పండి. మేం మా అబ్బాయిని వెతికి తెచ్చి ఆమె పాదాల మీద పడేయమనటం మీకు మాత్రం యేం భావ్యం. నేను పెంచుకున్నందుకు, నా కొడుకు నన్ను సంతోషపెట్టాడు. వాడి కేది యిష్టమో అది చేసుకుంటాడు. యెక్కడ శాంతి లభిస్తుందో అక్కడుంటాడు. గాలి మళ్లీ, యేనాడు, అమ్మా! నాన్నా! అంటూ వచ్చినా వాడు నా కొడుకే. వాళ్ళమ్మ కళ్ళు వాడి కోసం యెదురు చూస్తూ వుంటాయి.

మరొకటి మేము పెంపుడు తల్లి దండ్రులమేగా. మేము దగ్గరా? కన్నవారు దగ్గరా? కోడలునే తేల్చుకోమనండి. లేదా మీరు తేల్చి చెప్పండి.

[-*-]